J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 నెల్లూరు, 24.07.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 08 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

- దళితులపై వరుస దాడులు

# రాజకీయ కుట్ర జరుగుతోందా?

ఏపీలో దళితులే టార్గెట్‌గా వరుసగా దాడులు జరుగుతున్నాయంటూ ఒక సెక్షన్ మీడియాలో పెద్ద పెద్ద బ్రేకింగ్స్ వస్తున్నాయ్. వాస్తవానికి ఆ మీడియాలలో అంత పెద్ద బ్రేకింగ్స్ అంటేనే వాటి విశ్వసనీయతను అనుమానించే రోజులివి. అందుకే ఈ సందేహం. ఇది రాష్ట్రంలో రాజకీయ అవగాహన కలిగిన సగటు పౌరుని అనుమానం.

- వైసీపీకి బాసటగా ఉన్న దళితులను దూరం చేయడమే టార్గెట్టా?
- ప్రచారాలు.. ప్రతిపక్షాల ఆరోపణల్లో వాస్తవమెంత?
- ప్రతిచోటా పోలీసులే ఎందుకు పాత్రధారులవుతున్నారు?

నిజానికి వైసీపీకి దళితులు ఒకరకంగా వెన్నెముకగా చెప్పుకోవచ్చు. ఇందిరా గాంధీని వాళ్ళు ఎలా అభిమానించారో.. ప్రస్తుతానికి ఏపీలో వైసీపీని అంతకంటే ఎక్కువగానే సొంతం చేసుకున్నారు. ఇప్పటివరకు వైసీపీ పోటీచేసిన మొదటి ఉపఎన్నిక నుంచి 2014, 2019 ఎన్నికలలో పార్టీని వెన్నంటి ఉండి తాజా ఘన విజయంలో కీలకపాత్ర పోషించి తమ అనుకూల ప్రభుత్వం ఏర్పడిందన్న భావన దళిత సోదరులలో ఉంది.

(మిగతా 11వ పేజీలో)

## జూలై 24 నుండి 31దాకా నెల్లూరులో లాక్‌డౌన్

(వివరాలు 3వ పేజీలో)



## జగన్ పాలనలో...

# సామాన్యుడే అసామాన్యుడు



- సీనియర్లను పక్కనపెట్టి జూనియర్‌లకు మంత్రి పదవులు
- యువనేత రాజ్యంలో నవతరానికి పెద్దపీట



- అమాత్యులుగా అప్పలరాజు, వేణుగోపాలకృష్ణ
- ఉప ముఖ్యమంత్రిగా ధర్మానకు ప్రమోషన్

**రాష్ట్రంలో తాజా మంత్రివర్గ విస్తరణ కొందరికి మోదాన్ని, మరికొందరికి ఖేదాన్ని మిగిల్చింది. మోపిదేవి వెంకటరమణ, పిల్లి సుభాష్ చంద్రబోస్‌ల రాజీనామాలతో ఖాళీ అయిన స్థానాలను వాళ్ళ సామాజిక వర్గాలతోనే భర్తీ చేయడం ఒక ఎత్తైతే... అసలు ఎవరూ ఊహించని విధంగా జరిగిన వ్యక్తుల ఎంపిక అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.**

చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ అయినా గతంలో జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా చేశాడు, జిల్లా పార్టీలో కొన్ని కీలక బాధ్యతలు నిర్వర్తించాడు. కానీ సీదిరి అప్పలరాజుని మంత్రిని చేయడం వైసీపీలోని సాధారణ కార్యకర్తల్లో పెద్ద భరోసానే నింపింది. ఒక సామాన్య దిగువ మధ్య తరగతికి చెంది, కష్టపడి ఉన్నత వైద్య విద్యనభ్యసించిన రాజు తాను మంత్రి అవుతానని అసలు ఊహించి ఉండడు. అదీ ఇంత త్వరగా. 2017 వరకు రాజకీయాలతో సంబంధం లేని సీదిరి, జగన్ ఉద్దానం కిడ్నీ బాధితులను పరామర్శించడానికి వెళ్ళినప్పుడు డాక్టర్‌గా అక్కడకు హాజరై, తర్వాత జగన్ పాపులారిటీ చూసి ఆకర్షితుడై పార్టీలో చేరడం, అక్కడ ఉద్దండులుగా పేరున్న గౌతు లచ్చన్న మనమరాలు, జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గౌతు శిరీషపై పోటీచేసి 17 వేల ఓట్లతో గెలుపొంది శాసనసభ్యుడుగా ఎన్నికవడమే ఒక అద్భుతం. అలాంటి ఒక సాధారణ డాక్టర్‌ని మంత్రిని చేసి అసామాన్యుడిగా తీర్చిదిద్దిన ఘనత జగన్‌కే దక్కింది. రాజకీయాలలో అన్ని వర్గాల ప్రాతినిధ్యం అవసరం అని బలంగా భావించే జగన్ తన లక్ష్య సాధనలో రాష్ట్రంలో రాజకీయ విప్లవానికి తెరదీసి శభాష్ అనిపించుకుంటున్నాడు.

ఇక ఈ విస్తరణలో మంత్రి పదవులు ఆశించిన వారు, శాఖల మార్పుతో పాటు పదోన్నతి ఆశించిన వాళ్ళు నిన్నటి జగన్ నిర్ణయాలతో ఒక రకంగా షాక్‌కు గురయ్యారు అని చెప్పుకోవచ్చు. ముఖ్యంగా రెవెన్యూ, డిప్యూటీ సీఎం పదవి నిర్వహిస్తోన్న పిల్లి సుభాష్ చంద్రబోస్ రాజ్యసభకు వెళ్లడంతో ఆ రెండింటిపై చాలామంది సీనియర్లు కూడా కన్నేశారు. రెవెన్యూ శాఖకు ఇప్పుడు అన్ని కోరలు పీకేసినా ముఖ్యమంత్రి తర్వాత ప్రాధాన్యతగల శాఖగా దానికి క్రేజ్ ఉండేది. దానికోసం చాలా మంది ప్రయత్నించి భంగపడ్డట్టు సమాచారం.

అలాగే హోం మినిస్టర్‌కి కూడా శాఖా మార్పు ఉంటుందన్న వార్తలు రావడంతో కొందరు సీనియర్ మంత్రులు కాబోయే హోంమంత్రి మనమే అని కూడా చెప్పినట్లు సమాచారం. కానీ వీరందరి అంచనాలకు భిన్నంగా ముఖ్యమంత్రికి అత్యంత విధేయుడైన ధర్మాన కృష్ణదాస్‌కి ఉప ముఖ్యమంత్రి పదవి కట్టపెట్టడంతో ఆయన సోదరులు ధర్మాన ప్రసాద్‌రావుతో పాటు చాలా మంది సీనియర్లు, మాజీ మంత్రులకు మింగుడుపడలేదన్నది తాజా రాజకీయ విశ్లేషణ.




# ఉదయగిరికి.. ఇంక నీళ్ళ కొరత ఉండదు

## - ముఖ్యమంత్రి వైయస్ జగన్ హామీ ఇచ్చారన్న ఎమ్మెల్యే మేకపాటి



త్వరలోనే ఉదయగిరి మెట్ట ప్రాంతానికి సాగునీళ్ళు పుష్కలంగా అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈనెల 21న ఆయన తాడేపల్లిలోని సిఎం నివాసంలో ముఖ్యమంత్రిని కలిసి ఉదయగిరి నియోజకవర్గంలోని పలు సమస్యలను సిఎం దృష్టికి తీసుకువచ్చారు. వింజమూరులో ప్రజలకు మంచినీళ్ళ వసతికి కొరత లేకుండా చేయాలని కోరగా వెంటనే సిఎం ప్రత్యేక కార్యదర్శి ధనుంజయరెడ్డికి ఆ సమస్యను చెప్పి సత్వరం పరిష్కరించాలని, సోమశిల కాలువ నుంచి పైపుల ద్వారా వింజమూరు చెరువుకు నీళ్ళు నింపేవిధంగా చేయాలని ఆదేశించారని ఆయన తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి నీటిసరఫరా కోసం వాటర్‌గ్రిడ్‌ను కూడా సత్వరమే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. నియోజకవర్గ సమస్యలపై సిఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే మేకపాటి వివరించారు. ఉదయగిరి నియోజకవర్గంలోని సీతారాంసాగర్ ప్రాజెక్టు, వెలుగొండ ప్రాజెక్టులు కూడా సత్వరమే పూర్తిచేస్తామని కూడా ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. అదేవిధంగా కావలి-సీతారామపురం హైవే రోడ్డుకు, నందవరం-ఉదయగిరి మధ్య డబుల్‌రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారని చెప్పారు. వింజమూరు డివిజన్ కేంద్రంగా నియోజకవర్గంలోని 8మండలాలను కలిపి ప్రత్యేకంగా ఉదయగిరి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు విషయాన్ని ప్రస్తావించగా, సాధ్యాసాధ్యాలను పరిశీలించి తగు ఏర్పాట్లు చేస్తామని సిఎం తెలిపారని ఆయన వివరించారు.



# పచ్చదనంతో జిల్లా కళకళలాడాలి

## - 'జగనన్న పచ్చతోరణం'లో కలెక్టర్ చక్రధర్‌బాబు

'మొక్కలు నాటుదాం..పచ్చదనం పెంచుదాం'.. ఆకుపచ్చని ఆంధ్రప్రదేశ్ మన లక్ష్యం కావాలి.. జిల్లా అంతా పచ్చదనంతో కళకళలాడాలి అంటూ జిల్లా అధికారులు మొక్కలు నాటేందుకు సమాయత్తమయ్యారు. ఈనెల 22న జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు వెంకటాచలంలోని సరస్వతినగర్‌లో పేదలకు ఇచ్చే ఇళ్ళస్థలాల లేఅవుట్‌ల వద్ద సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డితో కలసి 'జగనన్న పచ్చతోరణం' కార్యక్రమాన్ని ప్రారంభించి మొక్కలు నాటారు. జిల్లాలో 10లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కలెక్టర్ చెప్పారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ముఖ్యమంత్రి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రజల భాగస్వామ్యంతో దీనిని విజయవంతం చేయాలన్నారు. మొక్కలు పెంచడం సామాజిక బాధ్యత అని ఆయన అంటూ మొక్కలు నాటడమే కాకుండా వాటి పరిరక్షణకు అందరూ కృషిచేయాలన్నారు. జిల్లాలో కరోనా వ్యాధి నియంత్రణకు పెద్దఎత్తున చర్యలు తీసుకుంటున్నామని, బాధితులను ఎవరూ వివక్షతో చూడవద్దని కలెక్టర్ సూచించారు. మొక్కలు నాటడం ద్వారా కాలుష్యాన్ని నివారించి పచ్చదనాన్ని పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని ఎమ్మెల్యే కాకాణి అన్నారు. జడ్పీ సిఇఓ సుశీల, ఆర్డీఓ హుస్సేన్‌బాషా, అటవీశాఖ అధికారులు రవిశంకర్, తహశీల్దార్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 2995కు చేరుకున్న కరోనా కేసులు

## - ఒక్కరోజే 146 మంది బాధితులు

జిల్లాలో కరోనా విజృంభణ రోజురోజుకీ పెరిగిపోతూనే ఉంది. ఈనెల 22న ఒక్కరోజే 146 మందికి కోవిడ్ వైరస్ సోకింది. దీంతో వారికి వైద్యం చేసేందుకు ఆసుపత్రుల్లో పడకలు కూడా చాలడం లేదు. దీంతో కరోనా కేసుల సంఖ్య 2995కు చేరుకుంది. ఈ వ్యాధి బారినపడి నెల్లూరులోని పెద్దాసుపత్రిలో చికిత్సలు పొంది కోలుకుని 88 మంది డిశ్చార్జి అయ్యారు. ఇప్పటివరకు జిల్లాలో మొత్తం డిశ్చార్జి అయిన వారు 1818 మంది కాగా, మిగిలిన 1108 మంది చికిత్సలు పొందుతున్నారు. కరోనా వ్యాధితో ఇప్పటికి జిల్లాలో 69 మంది మరణించారు. వ్యాధి తీవ్రత పెరిగిపోతుండడంతో జిల్లా ఉన్నతాధికారులు కరోనా నియంత్రణకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నారు.

# చేపల వ్యానులో మద్యం సీసాలు

చేపలు, రొయ్యల మాటున మద్యం సీసాలను దాచిపెట్టి వాటిని అక్రమంగా తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్న ఒక వ్యక్తిని జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఈనెల 22న పట్టుకున్నారు. బెంగుళూరు నుంచి నెల్లూరుకు అక్రమంగా మద్యాన్ని తీసుకువస్తున్న ఆ వ్యానుతో పాటు, అందులో ఉన్న సుమారు ఆరున్నర లక్షల రూపాయల విలువైన 556 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను నెల్లూరులో అదనపు ఎస్పీ శ్రీధర్‌రావు వెల్లడించారు. బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన కమలాకర్ నెల్లూరు నుంచి బెంగుళూరుకు చేపలు, రొయ్యలు తీసుకెళ్ళి విక్రయిస్తుంటాడని, అక్కడ నుంచి తిరిగివస్తూ మద్యం తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నాడని, చేపల బాక్సుల్లో మద్యం సీసాలు పెట్టి పైన పూల లోడు తీసుకుని వస్తుంటాడని, సెబ్ అధికారులు నెల్లూరులోని అయ్యప్పగుడి వద్ద చేస్తున్న తనిఖీల్లో ఆ వ్యానును పట్టుకున్నారని చెప్పారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని, ఈ అక్రమ మద్యం రవాణా వెనుక ఇంకా ఎందరున్నారో కూడా ఆరా తీస్తున్నామన్నారు.

# ఎన్టీఆర్ విగ్రహాన్ని తొలగించడం.. అన్యాయం

## - కోటంరెడ్డి శీనయ్య ఆగ్రహం

కావలి పట్టణంలోని ముసునూరులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని తొలగించడం అన్యాయమని, కేవలం కక్షతోనే వైకాపా నాయకులు ఎన్టీఆర్ విగ్రహాన్ని తొలగించారని తెలుగుదేశం పార్టీ నాయకుడు, నుడా మాజీ ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఈనెల 21న కావలిలో ఆయన మాట్లాడుతూ వైకాపా నాయకుల వత్తిడితోనే ఎన్టీఆర్ విగ్రహాన్ని తొలగించారని ఆరోపించారు. ఇదెంతో హేయమైన చర్య అన్నారు. కాగా, ఈ విషయమై కావలిలోని ఓ కళ్యాణమండపంలో టిడిపి నాయకులు నందమూరి అభిమానసంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటుచేయగా పోలీసులు అడ్డుకున్నారు. కరోనా, లాక్‌డౌన్‌ల నేపథ్యంలో సమావేశాలకు అనుమతి లేదని పోలీసులు చెప్పారు. దీంతో ఆ సమావేశాన్ని సమీపంలోనే ఉన్న కార్పొరేషన్ రీడింగ్‌రూమ్‌లోకి మార్చారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి యువరత్న నందమూరి బాలకృష్ణకు ఫోన్ చేసి పరిస్థితిని తెలియజేశారు. ఏదేమైనా ఎన్టీఆర్ విగ్రహం తొలగింపు భావ్యం కాదంటూ టిడిపి వర్గాలు, నందమూరి, బాలకృష్ణ అభిమానుల సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

# 'పేదల ఆకలి తీరుద్దాం'.. రండి

## - 'హంగర్ హెల్పర్స్' పేరుతో కొండాయపాలెంలో ఫ్రిజ్ ఏర్పాటు



పేదలకు సేవ చేయాలనే ఆలోచన ఉండాలే కానీ, వారికి సాయం చేసేందుకు ఎన్నో దారులున్నాయి. మానవత్వం ఉంటే చాలు..మనకున్నదానిలో ఎంతో కొంత ఇచ్చి నిరుపేదల బాధలు తీర్చవచ్చు.. అంటూ స్థానిక సర్వోదయకాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డా. నిర్మల్‌కుమార్ నెల్లూరులో 'హంగర్ హెల్పర్స్' పేరుతో నగరంలోని కొండాయపాళెంలో ఒక పెద్ద ఫ్రిజ్ ఏర్పాటుచేశారు. దీనిని రెడ్‌క్రాస్ ఛైర్మెన్ డాక్టర్ పి. చంద్రశేఖర్‌రెడ్డి ఈనెల 22న ప్రారంభించారు. ఈ ఏర్పాటును ఆయన ఈ సందర్భంగా అభినందిస్తూ, పేదల ఆకలి తీర్చేందుకు ప్రజలు కూడా సహకరించాలని, ఇళ్ళల్లో తయారుచేసుకునే ఆహారం, లేదా మిగిలిపోయిన మంచి ఆహారాన్ని వృధాగా పారేయకుండా పేదలకు ఈ ఫ్రిజ్ ద్వారా అందించవచ్చని, పండ్లు, కేక్‌లు, రొట్టెలు వంటివి కూడా ఇవ్వవచ్చని చెప్పారు. నగరంలోని హోటళ్ళు, రెస్టారెంట్ల వారు, కళ్యాణమండపాల వారు, కేటరింగ్ నిర్వాహకులు.. సమాజసేవకులు అందరూ ఈ సేవా కార్యక్రమంలో పాల్గొని సహకరించాలని డాక్టర్ నిర్మల్‌కుమార్ కోరారు. తొలుత, పేదలకు పండ్లు, ఆహారపొట్లాలు పంపిణీ చేశారు. రిటైర్డ్ తహశీల్దార్ కె.ప్రేమ్‌చంద్ సాల్మన్, విజయ ధర్మారావు, సురేష్, ధర్మారావు, డేవిడ్, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

### నెలాఖరు దాకా రంగనాథుని

# దర్శనం నిలిపివేత

నెల్లూరులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ రంగనాథస్వామి దేవాలయాన్ని ఈనెల 31 వరకు మూసివేస్తున్నట్లు ఆలయ ఇ.ఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆలయ పరిసరాల్లో కరోనా కేసులు ఎక్కువగా ఉన్నందువల్ల భక్తుల ఆరోగ్యం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అయితే, స్వామి వారికి అమ్మవార్లకు నిత్యసేవలు, పూజలు ఏకాంతంగా జరుగుతాయని, భక్తులకు అనుమతి లేదని చెప్పారు.

### కొండ బిట్రగుంటలో..

బోగోలు మండలంలోని కొండ బిట్రగుంటలో ఈనెల 21న ఒక యువకుడికి కరోనా పాజిటివ్ కేసు నమోదు కావడంతో భక్తులకు కొండ బిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దర్శనం తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఆలయ ఛైర్మెన్ శ్రీరామ్ మాల్యాద్రి, ఇ.ఓ మల్లికార్జున్‌రెడ్డిలు తెలిపారు. స్వామివారికి నిత్యపూజలు జరుగుతాయని, కానీ భక్తుల ప్రవేశానికి అనుమతి లేదని వారు పేర్కొన్నారు.

### ఇక్కడి వైద్యంపై నమ్మకం లేకనే..

# పొరుగు రాష్ట్రాలకు పరుగులు

## - బీద విమర్శ

కరోనా కట్టడిలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని, ప్రభుత్వం నిర్వహిస్తున్న వైద్యంపై నమ్మకం లేకనే పలువురు వైకాపా నాయకులు వైద్యం కోసం పొరుగు రాష్ట్రాలకు పరుగులు తీస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల గత పదిరోజులుగా రోజూ వేలాదిమంది కరోనా బారిన పడుతున్నారని, కేసుల పెరుగుదలలో దేశంలో రెండవస్థానానికి, మరణాల్లో నాలుగోస్థానానికి రాష్ట్రం చేరుకుందని ఆయన పేర్కొన్నారు. కరోనాతో సామాన్యుల పరిస్థితి దయనీయంగా ఉందని, ఉపాధి కోల్పోయిన ప్రతి పేద కుటుంబానికి పదివేల రూపాయల వంతున ప్రభుత్వం ఆర్థికసాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

### అకాలవర్షంతో..

# వేరుశనగ మునక

ఈనెల 18వ తేదీ రాత్రి కురిసిన అకాలవర్షానికి వేరుశనగ పంట మునిగిపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ అకాలవర్షానికి దొరవారిసత్రం మండలంలోని పలు ప్రాంతాల్లో వేరుశనగ పంట దెబ్బతినిందని, జిల్లా అధికారులు పరిశీలించి, నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని రైతాంగం కోరుతోంది.

# నెల్లూరులో లాక్‌డౌన్

## ● తొలి విడతగా 8 రోజుల పాటు అమలు

జులై 24వ తేదీ శుక్రవారం నుండి 31వ తేదీ శుక్రవారం వరకు తొలి విడతగా నెల్లూరు నగరంలో 8 రోజుల పాటు మళ్ళీ లాక్‌డౌన్ విధిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు గురువారం ప్రకటించారు. కరోనా మహమ్మారి విస్తృతంగా విస్తరిస్తున్న తరుణంలో ఇప్పుడు జిల్లాలో పలు మునిసిపాలిటీలు, మండలాల పరిధిలో లాక్‌డౌన్ అమలవుతోందని, 24వతేది నుండి నెల్లూరు నగరంలో కూడా లాక్‌డౌన్ విధిస్తున్నట్లు ఆయన ప్రకటించాడు. ఈ లాక్‌డౌన్ కఠినంగా ఉంటుందని, ప్రజలు అత్యవసర పరిస్థితులలో తప్ప బయటకు రావద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

### ఉదయం 6 నుండి 1గంట వరకు దుకాణాలకు అనుమతి

నిత్యావసర సరుకులతో పాటు ఇతర దుకాణాలన్నిటికి ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు అనుమతి ఇస్తున్నట్లు చెప్తూ.. మందులు, పాలు వంటి వాటికి మాత్రం సాయంత్రం 5గంటల వరకు అనుమతి ఉందన్నారు. అనేకమంది వ్యాపారస్తులు తాము లాక్‌డౌన్‌కి సహకరిస్తామని స్వచ్ఛందంగా ముందుకు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని అధికారులు చెప్తున్నారు.

ప్రజలు కూడా సహకరించి మధ్యాహ్నం 1గంటపైన ఇళ్లలో నుండి బయటకు రావద్దని అధికారులు కోరుతున్నారు. కరోనా బాధితుల సంఖ్య వందల నుండి వేలలోకి వెళ్లిన నేపథ్యంలో ఇలాంటి చర్యలు తప్పడంలేదన్నది అధికారుల మాట. వ్యాధిని నిరోధించి చైన్ బ్రేక్ చెయ్యాలంటే లాక్‌డౌన్ ఒక్కటే మార్గమన్నది కూడా వారి అభిప్రాయం. వ్యాపార వర్గాలు, ప్రజలు ఎవరికి వారే స్వచ్ఛంధంగా ఇలా ముందుకు రావడం శుభ సూచకమని, నగర ప్రజానీకమంతా కూడా పరిస్థితులను అర్ధం చేసుకుని, కరోనాని కట్టడి చేయడంలో ఎవరికివారు స్వీయనియంత్రణలు పాటించి ఆ మహమ్మారి బారిన పడకుండా తమను తాము రక్షించుకోవాలని, 24 నుండి అమలయ్యేది స్వచ్ఛంధ లాక్‌డౌనే కాని, నిర్బంధ లాక్‌డౌన్ కాదని, అయినప్పటికీ అనవసరంగా రోడ్లపైన తిరిగే ప్రజలపైన చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

# రానున్న రెండు నెలలు కీలకం

- కరోనా బాధితులకు సౌకర్యవంతమైన వసతులు కల్పించండి
- ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలకు జిల్లా కలెక్టర్‌విజ్ఞప్తి



ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యం, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులు, జిల్లా జాయింట్ కలెక్టర్ తదితరులతో కలిసి జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు 23వ తేదీ గురువారం జిల్లాలో కరోనా నేపథ్యంలో తీసుకుంటున్న చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించాడు. అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయం కావాలన్నా తీసుకోవచ్చని, కరోనా రోగులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా, వారికి ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూసుకోవాలని సూచించాడు. రాబోయే రెండు నెలలు అత్యంత కీలకమని, అందుకు తగిన విధంగా ఆసుపత్రులలో అన్ని వసతులు సిద్ధం చేసుకుని కరోనా మహమ్మారితో పోరాడడానికి సంసిద్ధులు కావాలని ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలకు కలెక్టర్ విజ్ఞప్తి చేశాడు. తమ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న కరోనా రోగులు తమ దృష్టికి తెచ్చిన కొన్ని ఇబ్బందులను ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు కలెక్టర్ దృష్టికి తేగా వెంటనే స్పందించిన కలెక్టర్.. తగు చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులను ఆదేశించాడు. ప్రస్తుత పరిస్థితుల్లో కరోనా బాధితుల ఇబ్బందులను ప్రధాన సమస్యలుగా భావించి వాటిని పరిష్కరించడంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించకుండా పనిచేయాలని అధికారులకు గట్టిగా సూచించాడు.

# కలెక్టర్‌ల బదిలీపై కూడా రాజకీయమా..?

**ఇటీవల రాజకీయాలలో జరుగుతున్న సంఘటనలు, రాజకీయ నాయకులు ఇస్తున్న స్టేట్‌మెంట్లు చూస్తుంటే రాజకీయ వ్యవస్థ రానురాను ఇంత దిగజారిపోతుందా అనిపిస్తోంది.**



నెల్లూరుజిల్లా కలెక్టర్ మిరియాల శేషగిరిబాబు బదిలీపై రాజకీయ నాయకులు చేస్తున్న విమర్శలు అర్ధరహితంగా ఉన్నాయి. పరిపాలన ప్రక్రియ సక్రమంగా జరగాలనే క్రమంలో అధికారుల సమర్ధత, సత్తాను బట్టి వారి నియామకాలు జరుగుతాయి. కొన్ని సందర్భాల్లో ఆశించిన మేరకు ఆ అధికారి పనిచేయకపోవడం, ప్రభుత్వ పథకాల అమలులో పురోగతి చూపించలేకపోవడం, రాష్ట్ర స్థాయి అధికార వర్గంతో పాటు స్థానిక రాజకీయ నేతల అంచనాల మేరకు సదరు అధికారి పనితీరు వుండకపోవడం వంటివి జరిగితే తక్షణమే సదరు అధికారిని బదిలీ చేస్తారు. ఇది సర్వసాధారణం. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, ఏ నాయకుడు ముఖ్యమంత్రిగా వున్న స్థానిక ప్రజాప్రతినిధులు ఇచ్చే ప్రోగ్రెస్ రిపోర్టు మీదే ఆయా అధికారుల భవిష్యత్తు నిర్ణయించబడి ఉంటుంది.

ఇటీవల జరిగిన నెల్లూరు కలెక్టర్ శేషగిరిబాబుది కూడా అలాంటి బదిలీయే. ఆయన మాటలు ఎక్కువ, చేతలు తక్కువని, నాడు–నేడు కార్యక్రమాన్ని పర్యవేక్షించడంలో విఫలమయ్యాడని, కరోనా నియంత్రణ విషయంలో కూడా ఆశించిన మేరకు కట్టడి చేయలేకపోయాడని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూపంపిణీ కార్యక్రమానికి అవసరమైన భూసేకరణలో పారదర్శకంగా వ్యవహరించలేక పోయాడని, పూర్తిగా ఒక వర్గ నేతలకే సరెండర్ అయిపోయాడని.. అంటూ కొందరు అధికారపార్టీ నాయకులే ఆయన మీద బహిరంగంగానే విమర్శలు చేశారు.

జిల్లాలోని కొన్ని పారిశ్రామిక సంస్థల యాజమాన్యాలు సైతం కలెక్టర్ వ్యవహార శైలిపై అసంతృప్తి వ్యక్తపరిచాయి. అపాయింట్‌మెంట్లు ఇవ్వడని, ఫోన్‌లు ఎత్తడని, పారిశ్రామిక ప్రగతికి తోడ్పడడం లేదని కూడా ఆరోపించాయి. ఈ క్రమంలో శేషగిరిబాబుపై బదిలీ వేటు వేసి, ముక్కుసూటి మనస్తత్వం కలిగిన నిఖార్సయిన అధికారి చక్రధర్‌బాబును ప్రభుత్వం కొత్త కలెక్టర్‌గా నియమించింది.


ఓ వర్గం రాజకీయ నాయకులు తమ మాట సాగలేదనే కుట్రతో పాత కలెక్టర్‌ను బదిలీ చేయించారని తెలుగుతమ్ముళ్ళు ఆరోపించడం హాస్యాస్పదంగా ఉంది. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో కూడా కేవలం రెండు మూడు నెలలు పనిచేసి బదిలీపై వెళ్లిపోయిన అధికారులు కూడా వున్నారు. అంతమాత్రాన అవి రాజకీయ బదిలీలు అని అనడం, అనుకోవడం అర్ధరహితం.

ఏ అధికారి అయినా తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేయడు, అధికారంలో ఉన్న ప్రభుత్వ పెద్దలు ఏ పని అప్పచెబితే, ఆ పనిని సమర్ధవంతంగా పనిచేయడానికే ఇష్టపడతారు. అధికారంలో ఉన్న ప్రభుత్వంతో చిక్కులు కొనితెచ్చుకునే సాహసం చేయరు. కాబట్టి అధికారులను, రాజకీయనాయకులతో పోల్చడం సరికాదు. జిల్లా అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేయడానికి వచ్చే మంచి అధికారులను ఇలాంటి కుళ్ళు రాజకీయాలతో భ్రష్టు పట్టించకుండా వారి పని వారిని చేసుకోనిస్తే జిల్లా అన్ని రంగాలలో ముందుకుపోతుంది.






## అశృనివాళి




## డాక్టర్ చిల్లకూరు మోహన్‌రెడ్డి గారు

ఆత్మబంధువుకి అశృనివాళి



తుంగా కుటుంబం

## 'ప్రభా'తం

# కల్తీలకు ఇక కళ్లెం

అనైతిక వ్యాపారాలు, నాసిరకం వస్తువుల ఉత్పత్తులతో.. మోసపు ప్రకటనలతో వినియోగదారుల నెత్తిన శఠగోపం పెడుతున్నవారి వెన్నులో వణుకు పుట్టేలా కఠినచర్యలుండేవిధంగా కేంద్రప్రభుత్వం తాజాగా వినియోగదారుల చట్టం రూపొందించింది. అమాయక జనాన్ని బురిడీ కొట్టించే మోసకారులను గట్టిగా దండించడమే కాక, వినియోగదారులకు ఇది రక్షణ కవచంలా పనిచేస్తుంది. వినియోగదారుల హక్కుల సంరక్షణ కోసం కేంద్రం ఇలా.. ఒక గట్టి చట్టం తేవడం ఎంతైనా హర్షదాయకం. దేశ ఆరోగ్య సౌభాగ్యానికిది శుభపరిణామం!...

### కల్తీ! కల్తీ! కల్తీ!...

ఈ మాటే ఎక్కడ విన్నా. గాలి కల్తీ..నీళ్ళు కల్తీ..అన్నట్లుగా ఈ కలికాలంలో కల్తీ లేనిది.. కల్తీ కానిది ఏదీ లేదు.. అన్నీ కల్తీమయమైపోయాయని ప్రజలందరూ బాధపడుతున్న కాలం ఇది. ఏ వస్తువు చూసినా, దేంట్లో చూసినా కల్తీయే. అసలు కల్తీ లేని సరుకులు ఈ భూప్రపంచంలో దొరుకుతాయా?..అన్నట్లుగా తయారైంది పరిస్థితి. అలాంటి పరిస్థితులకు ఇక చెక్ పెట్టేందుకు కేంద్రప్రభుత్వం సమాయత్తం కావడం.. కొత్తగా వినియోగదారులకు అన్నివిధాలా రక్షరేకుగా ఉండేలా వినియోగదారుల చట్టం రూపొందించి కొత్త మార్గదర్శకాలు జారీచేయడం ఎంతైనా శుభపరిణామం.

అసలు కల్తీ లేకుండా వ్యాపారం అనేది ఉంటుందా?..కల్తీ చేయకపోతే లాభాలు ఎలా వస్తాయి?..అనే మాటలు వ్యాపార రంగంలో మనం తరచూ వింటూనే ఉంటాం. ఎవరి ఆరోగ్యం ఏమైపోయినా పర్వాలేదు కానీ..తమకు లాభాలే ముఖ్యమనే తత్వం వ్యాపారరంగంలో మనం చూస్తున్నదే. అచ్చమైన.. స్వచ్ఛమైన వ్యాపారం అనేది ఎప్పుడో పోయింది. న్యాయంగా వ్యాపారాలు చేసే ఆ పాతకాలపు రోజులు ఇప్పుడు రమ్మన్నా రావు. పాలు-నీళ్ళు కూడా కల్తీ అయిపోతున్న రోజులివి. నాణ్యమైన సరుకులన్నవి ఆకాశ కుసుమాలైపోయాయి. ప్రజలను మోసపుచ్చే మాయమాటలతో నకిలీ వస్తువులనే అసలుసిసలు వస్తువులన్నట్లుగా నమ్మబలికి వ్యాపారాలు చేసేవారు బోలెడు మంది. కొన్నిచోట్లయితే బూజుపట్టి నాణ్యత కోల్పోయిన వస్తువులను కూడా అప్పటికప్పుడు బూజు దులిపి భలే మంచి సరుకంటూ అమ్మేస్తూ ఉంటారు. వాటిని కొన్నవారికి నష్టాలు, తిన్నవారికి వాంతులు విరోచనాలు. అంతటితో అయిపోలేదు. కల్తీ సరుకులతో చేసిన పదార్థాలను తిని లేనిపోని రోగాలకు గురై ఆసుపత్రుల చుట్టూ తిరిగే జనానికి కూడా అంతే ఉండదు. ఇదంతా ఎంతోకాలం నుంచీ ఉన్నదే. అయినా ప్రజల బాధల గురించి నిజంగా ఎవరు పట్టించుకుంటున్నారు?...అని ఆవేదన చెందుతున్న తరుణంలో, ఆ దుర్భర పరిస్థితులను కొంతైనా మార్చేందుకు ప్రధాని మోడీ సారధ్యంలోని కేంద్ర ప్రభుత్వం నడుం బిగించి కొత్త వినియోగదారుల చట్టం ప్రవేశపెట్టడం ఎంతైనా హర్షదాయకం. అనైతిక వ్యాపారాలు, నాసిరకం వస్తువుల ఉత్పత్తులతో..మోసపు ప్రకటనలతో వినియోగ దారుల నెత్తిన శఠగోపం పెడుతున్నవారికి వెన్నులో వణుకు పుట్టేలా కఠినచర్యలుండేవిధంగా కేంద్రం ఈ వినియోగదారుల చట్టాన్ని పదునెక్కించింది.

జనానికి కల్తీ వస్తువులు, నకిలీ సామగ్రి అంటగట్టి ఏదోవిధంగా సొమ్ము చేసుకోవాలనుకునేవారి ఆశలు ఇక అడియాసలే కానున్నాయి. వినియోగదారులను బురిడీ కొట్టించే మోసకారులను గట్టిగా దండించడమే కాక, వినియోగదారులకు పూర్తిస్థాయిలో ఒక రక్షణ కవచంలా పనిచేస్తుంది ఈ చట్టం. కల్తీలు చేసేవారికి.. ఇకపై లక్ష రూపాయల దాకా జరిమానాతో పాటు ఆరునెలల జైలుశిక్ష కూడా తప్పని పరిస్థితి వచ్చేసింది. వినియోగదారులకు అన్ని విధాలా రక్షణ కల్పించే ఈ చట్టం రావడం.. అందరూ స్వాగతించదగిన పరిణామం. ప్రత్యక్షంగానే కాదు, ఆన్‌లైన్ కోనుగోళ్ళకు కూడా వర్తించే విధంగా ఈ చట్టం మరింత పెద్ద విస్తృతితో వస్తోంది. ఈ కొత్త వినియోగదారుల చట్టం కల్తీలకు కళ్ళెం వేసేందుకు తప్పకుండా ఉపయోగపడుతుందని ప్రజలంతా ఆశిస్తున్నారు.

వాస్తవానికి ఈ చట్టం 1986లోనే ఉన్నా దానికి మరింత పదునుపెట్టి, వినియోగదారులను మోసంచేసే వారి ఆటకట్టించేందుకు మరింత కట్టుదిట్టంగా తయారై గత ఏడాదే పార్లమెంట్ నుంచి ఆమోదం పొందింది. అదే ఇప్పుడు వినియోగదారుల హక్కులను సంరక్షించే సరికొత్త ఆయుధంగా కొత్తచట్టమై తాజాగా అమలులోకి వస్తోంది. ఇటీవలి కాలంలో దేశంలో ఈ-కామర్స్, ఆన్‌లైన్ కొనుగోళ్ళు పెద్దఎత్తున విస్తరిస్తున్న నేపథ్యంలో అందుకనుగుణంగా ఈ కొత్త చట్టం పరిధి మరింత బాగా విస్తరించడం ఎంతైనా మంచి పరిణామం. వినియోగదారుల ప్రాణాలతో చలగాటమాడే తయారీదారులు, వ్యాపారులకు గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ వినియోగదారుల హక్కుల సంరక్షణ చట్టం ప్రకారం జైలుశిక్ష, జరిమానా కూడా విధించే అవకాశం ఉంది. వస్తువులు, సేవల ధరలు, నాణ్యత, సామర్థ్యం, స్వచ్ఛత గురించి ఇకపై వాస్తవాలను వినియోగదారులకు చెప్పాల్సి ఉంటుంది. సరసమైన ధరల్లో రకరకాల వస్తువులను కూడా అందుబాటులో ఉంచాలి. ఈ చట్టం అమలు బాధ్యతను 'కేంద్ర వినియోగదారుల హక్కుల సంరక్షణ ప్రాధికారసంస్థ'కు అప్పగించారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో ఒక డైరెక్టర్ జనరల్ ఉంటారు. ఆయన నేతృత్వంలో పనిచేసే దర్యాప్తు విభాగం కూడా ఉంటుంది.

వినియోగదారుల వివాదాల పరిష్కారానికి సంబంధించి త్వరలోనే జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో కమిషన్లు కూడా ఏర్పాటు కానున్నాయి. ఈ కమిషన్లు జారీచేసే ఉత్తర్వులను అమలు చేయకుంటే కనీసం నెల నుంచి మూడేళ్ళ దాకా జైలుశిక్ష, పాతిక వేల నుంచి లక్ష దాకా జరిమానా కూడా విధించవచ్చు. ఈ సంస్థ దర్యాప్తులో వ్యాపారులు, తయారీదారులు తప్పుచేసినట్లు తేలితే..అందుకు బాధ్యులైనవారికి రెండేళ్ళదాకా జైలుశిక్ష, లక్ష రూపాయల దాకా జరిమానా కూడా విధించే అవకాశం ఉంటుంది. అలాంటి తప్పులే పదేపదే చేస్తే ఈ శిక్షలు అయిదేళ్ళ జైలుశిక్ష, 50 లక్షల జరిమానా దాకా కూడా పెరుగుతాయి. కల్తీ వస్తువులు విక్రయిస్తే 6 నెలల జైలుశిక్ష, లక్ష రూపాయల దాకా జరిమానా విధిస్తారు. కల్తీవస్తువుల వల్ల వినియోగదారుడు గాయపడినా, లేదా మరణించినా ఇక భారీ మూల్యమే చెల్లించుకోవాల్సి ఉంటుంది. బాధ్యులైనవారికి జీవితఖైదు విధించడంతో పాటు 10 లక్షల దాకా జరిమానా కూడా విధించే అవకాశం ఉంది. దీంతో ఇన్నాళ్ళకైనా కల్తీలకు, నకిలీలకు ఇక చెక్ పెట్టే చట్టం వచ్చేసినట్లే!...

ఏదేమైనా.. వినియోగదారుణ్ణి మోసగించారో.. గతంలో లాగా కాదు.. ఇక నేరుగా జైలుకే అనేమాట.. ఇక వాస్తవరూపంలోకి రానుండడం ఎంతైనా హర్షదాయకం... దేశ ఆరోగ్య సౌభాగ్యానికిది శుభపరిణామం.!

---

ఈ-మెయిల్
ప్రజావాణి
roopagroup@yahoo.com

## బళ్ళు తెరిస్తే ప్రమాదమే..!

సెప్టెంబర్ 5వ తేదీ నుండి స్కూళ్ళు తెరుస్తామని ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి. కరోనా మహమ్మారి రోజురోజుకీ విజృంభిస్తోంది. రోజుకి లక్ష కేసులు దాటే పరిస్థితి దగ్గరలోనే వుంది, పదులు దాటి వందలు పోయి వేల నుండి ఇప్పుడు లక్షలకు చేరుకుంది. ఇలాంటి పరిస్థితుల్లో కరోనా నియంత్రణపై పూర్తి అవగాహన రాకుండా స్కూళ్ళు తెరవడం చిన్నపిల్లల జీవితాలతో చెలగాటమాడడమే! ఓవైపు 10సంవత్సరాల లోపు పిల్లలు బయటకు రావద్దంటూనే మరోవైపు బళ్ళు తెరుస్తామనడం ఎంతవరకు సబబు.

*ఆర్. పి. రామయ్య*, **కొండాయపాళెం.**

### అయ్యో!.. అది రెడ్‌క్రాస్ ఆశ్రమం కాదు..

## గాంధీజీ చేతులమీదుగా ప్రారంభమైన 'పినాకినీ సత్యాగ్రహాశ్రమం'!

నెల్లూరుకు సమీపంలోని ఇందుకూరుపేట మండలం పల్లిపాడు గ్రామంలో ఉన్న పినాకిని సత్యాగ్రహాశ్రమం జిల్లాలోనే కాదు దేశవ్యాప్తంగా ఎంతో పేరుగాంచింది. గాంధీజీ కస్తూర్బాతో కలసి నెల్లూరుకు వచ్చిన సందర్భంలో 7-4-1921న పల్లిపాడుకు వారు విచ్చేసి ఈ ఆశ్రమానికి ప్రారంభోత్సవం చేశారు. పూజ్య బాపూజీ చేతుల మీదుగా ఈ ఆశ్రమం పల్లిపాడులో ప్రారంభం కావడం ఒక పెద్ద విశేషం. ఈ ఆశ్రమ నిర్మాణం, గాంధీజీ ఈ ఆశ్రమాన్ని ప్రారంభించడం వంటివన్నీ జిల్లా స్వాతంత్ర్యోద్యమ చరిత్రలోనే ఎంతో అపూర్వమైన ఘట్టాలు. దేశంలోనే ఎంతో ప్రఖ్యాతిచెందిన ఈ ఆశ్రమం.. నెల్లూరు వారికే కాదు.. నెల్లూరు జిల్లాకే గర్వ కారణం. నాటి స్వాతంత్ర్య సమరయోధులకు నిలయంగా ఉంటూ ఆనాటి స్వాతంత్ర్యోద్యమానికి ఎంతో బాసటగా నిలిచిన ఆశ్రమం ఇది. పినాకినీ నదీ తీరాన ప్రారంభమైన ఆశ్రమం కనుక దీనికి అప్పట్లో 'పినాకిని సత్యాగ్రహాశ్రమం' అని నామకరణం జరిగిందన్నది అందరికీ తెలిసిన విషయమే. పల్లిపాడు 'పినాకిని సత్యాగ్రహాశ్రమం'..లేదా 'పల్లిపాడు గాంధీజీ ఆశ్రమం' పేరుతో ఇది నేటికీ ఎంతగానో ప్రఖ్యాతమైంది. అయితే కొన్నేళ్ల క్రితం ఈ ఆశ్రమ నిర్వహణ బాధ్యతను రెడ్‌క్రాస్‌కు అప్పగించారు. రెడ్‌క్రాస్ అంటే అంతర్జాతీయ స్థాయిలో గొప్ప సంస్థ. ఈ ఆశ్రమాన్ని రెడ్‌క్రాస్ వారు నిర్వహించడం అందరికీ ఎంతో సంతోషదాయకం.

అయితే, నిర్వహణ బాధ్యతలున్నంత మాత్రాన ఇది 'రెడ్‌క్రాస్ సొసైటీ గాంధీ ఆశ్రమం' అనడం సరైనది కానే కాదు. అలా పత్రికల్లో ప్రచారం చేసుకోవడం కూడా ఏమాత్రం సముచితం కాదు. అలాంటి అనుచితమైన ప్రచారాలు మానుకుంటే ప్రజలు హర్షించడమే కాక, గాంధేయవాదులు కూడా రెడ్‌క్రాస్ నిర్వహణను మరింతగా మెచ్చుకుంటారు. పినాకినీ సత్యాగ్రహాశ్రమ నిర్వహణను రెడ్‌క్రాస్ చేపడుతున్నదే తప్ప, ఇది రెడ్‌క్రాస్ గాంధీజీ ఆశ్రమం కాదని, ఇది పేరెన్నికగన్న 'పినాకిని సత్యాగ్రహాశ్రమం' అనీ, ఈ విషయం స్పష్టం చేయడానికే ఈ నాలుగు మాటలు చెప్పడం. జాతీయోద్యమానికి సంబంధించి ఇలాంటి చరిత్రాత్మకమైన విషయాల్లో ప్రజలకు స్పష్టమైన అవగాహన కోసం ఈ విషయాన్ని ఇక్కడ ప్రస్తావించడం జరిగిందని గమనించగలరు.

– *డా. జెపి వైద్య*, **గాంధేయవాది, ఇండియన్ రెడ్‌క్రాస్ సభ్యుడు, ఔరంగాబాద్.**

## ఛీ.. ఛీ... నికృష్టపు రాజకీయాలు

రాజస్థాన్‌లో జరుగుతున్న రాజకీయ పరిణామాలు చూస్తుంటే జుగుప్స కలుగుతోంది. పదవుల కోసం ఈ నాయకులు ఎంతటి స్థాయికైనా దిగజారడాన్ని గమనిస్తుంటే అసహ్యం వేస్తోంది. కాంగ్రెస్ పార్టీలో హుందాతనానికి మారుపేరుగా నిలచిన రాజేష్ పైలట్ వంటి రాజనీతిజ్ఞుడైన నాయకుడి వారసుడిగా అయన పుత్రరత్నం సచిన్ పైలట్ పదవీ వ్యామొహం చూస్తుంటే, ఛీ.. ఛీ... ఇవి ఎంత దౌర్భాగ్యపు రాజకీయాలో అనిపిస్తోంది.

సచిన్ పైలట్‌ని సమర్ధవంతమైన యువ నాయకుడని పొగిడిన నోటితోనే ఇప్పుడు అతడొక అసమర్ధుడు, పనికిరాని వాడు అని ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ విమర్శించడం గమనిస్తే నికృష్టపు రాజకీయ నాయకుల వికృష్టపు ప్రవర్తనతో రాజకీయాల పట్లే విరక్తి కలుగుతోంది.

పరిపూర్ణమైన ఆధిక్యతతో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ సైతం రాష్ట్రాలలో కూడా తమ జెండా పాతడానికి ఇలాంటి చవుకబారు రాజకీయాలతో, రాజకీయ వ్యవస్థనే అభాసుపాలు చేసే ప్రయత్నం చెయ్యడం సిగ్గుచేటైన విషయం. సచిన్‌పైలట్‌ను అడ్డం పెట్టుకుని రాజస్థాన్‌ని తమ ఖాతాలో వేసుకోవాలన్న బీజేపీ ఆలోచన ఫలించకపోగా ఆ పార్టీ అభాసుపాలైపోయింది. దేశం అంతటా భారతీయ జనతా పార్టీ జండా పాతాలనే ప్రయ త్నంలో ఆ పార్టీ విజయం సాధిస్తుందా..? లేక పరువుపోయి వున్న పదవి కూడా ఊడగొట్టుకుంటుందా..?? అన్నది రాబోయే రోజులలో తెలుస్తుంది. ఉచ్ఛం, నీచం, నీతి, నియమం లేని రాజకీయాలలో ఏదైనా సాధ్యమే.

*యం. చంద్రమౌళి*, **కొత్త ఢిల్లీ.**

## నేతల్లారా నెల్లూరుకు అన్యాయం జరగనీయకండి

పరిపాలనా సౌలభ్యం కోసం అంటూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న కొత్త జిల్లాల ఆలోచన మంచిదే. ఈ క్రమంలో నెల్లూరుకు తగిన ప్రాధ్యాన్యతనిచ్చి సరైన న్యాయం చేయకపోతే మాత్రం ఆయన నెల్లూరీయులకు ద్రోహం చేసినట్లే.

నెల్లూరుజిల్లాకు సూచికల్లాంటి షార్ రాకెట్ కేంద్రం, కృష్ణపట్నం పోర్టు, సోమశిల జలాశయం లాంటి ప్రధాన ప్రదేశాలన్నీ తిరుపతి జిల్లాలో కలిపితే నెల్లూరు అనాధగా మిగిలిపోతుంది. జిల్లాల పునర్వ్యవస్తీకరణ నేపథ్యంలో ప్రస్తుతం వున్న జిల్లాలకు ఎక్కడా అన్యాయం జరగకుండా విభజన చెయ్యాలి. పార్లమెంటు నియోజకవర్గాల ప్రాతిపదికన గుడ్డిగా చేస్తే చాలా జిల్లాలో నెల్లూరులాంటి పరిస్థితులు కలిగే అవకాశం వుంది. నెల్లూరు జిల్లాలోని వైయస్ఆర్ పార్టీ నాయకులందరూ జగన్‌రెడ్డి విధేయులు. ఆయన నిర్ణయాన్ని శిరసా పాటిస్తారు తప్ప ఆయనకు సలహాలు సూచనలు ఇచ్చే చొరవ, ధైర్యం వీళ్లకు లేదు. వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి గారు, విజయసాయిరెడ్డిగారు లాంటివాళ్ళు జోక్యం చేసుకుని వాస్తవాలను, నెల్లూరీయుల మనోభావాలను ముఖ్యమంత్రి గారికి వివరించి జిల్లాకు అన్యాయం జరగకుండా చూడాలి.

*మారంరెడ్డి బలరామిరెడ్డి*, **ముత్తుకూరు.**

# గందరగోళంలో గూడూరు వైకాపా





- బాహాటంగానే కలెక్షన్‌లు మొదలుపెట్టిన ఎమ్మెల్యే
- ఎమ్మెల్యే తీరును వ్యతిరేకిస్తున్న ద్వితీయశ్రేణి నాయకులు
- అందరూ నాయకులే.. అందరిదీ పలుకుబడే!
- నలుగుతున్న కార్యకర్తలు, అయోమయంలో పార్టీ వర్కర్లు
- అవకాశాన్ని అనుకూలంగా మలచుకుంటున్న బల్లి దుర్గాప్రసాద్

**మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, మాజీమంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి వంటి రాజకీయ ఉద్దండులకు పుట్టినిల్లు గూడూరు నియోజకవర్గం. అనాదిగా ఈ నియోజకవర్గం రిజర్వుడు కేటగిరి క్రిందకు రావడంతో ఇక్కడ పరోక్షంగా తప్ప ప్రత్యక్షంగా ఎప్పుడూ అగ్రవర్ణాల ఆధిపత్యం లేదు.**

జనార్ధనరెడ్డి జీవించి ఉన్నంతకాలం గూడూరు నియోజకవర్గంలో ఆయన మాటే ఎక్కువగా సాగేది. ఆయన దివంగతుడైన తరువాత ఇక్కడ ప్రత్యక్ష రాజకీయ పోరు కన్నా పరోక్ష రాజకీయ పోరాటమే ఎక్కువయ్యింది. జనార్ధనరెడ్డి తనయుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అటు వెంకటగిరి నియోజకవర్గంతో పాటు ఇటు గూడూరు నియోజకవర్గంలోనూ తన ఉనికిని తెలుపుతున్నాడు. తన తండ్రివెంట నడిచిన వారికి తోడుగా వారి అవసరాలు చూస్తూ అందరికీ అందుబాటులో వున్నాడు.

ఇక కోవూరు నియోజకవర్గంతో పూర్తిగా బంధాన్ని పెనవేసుకుపోయిన శీనయ్య కొడుకు ప్రసన్న గూడూరు విషయంలో పెద్దగా తలదూర్చకపోయినా వారి దాయాదులు, నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, వినోద్‌రెడ్డి లాంటివాళ్ళు ఇక్కడ నల్లపరెడ్ల వర్గాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు. ఒక దశలో నేదురుమల్లిని వ్యతిరేకించి గూడూరు నియోజకవర్గ కోడలు పనబాక లక్ష్మి వెంట కూడా వీళ్ళు నడిచారు. ఆమె 10 సంవత్సరాలు కేంద్రమంత్రిగా వున్నా ఆమె వల్ల రాజకీయంగా వీరికి పెద్దగా ఒరిగిందేమీ లేదు.

ఇక యల్లసిరి గోపాలరెడ్డి ఇక్కడ మరో ప్రధాన నాయకుడు, జిల్లా కాంగ్రెస్ పదవికి రాజీనామా చేసి వైసిపిలోకి వచ్చాడు కాబట్టి ఆయనకు ఆ పార్టీ బాగానే గుర్తింపునిచ్చింది. ప్రత్యక్ష రాజకీయాల్లో పెద్దగా ప్రభావం చూపలేకపోయినా పరోక్ష లావాదేవీల్లో తన సత్తా చూపగల మరో నాయకుడు కొడవలూరు ధనుంజయరెడ్డి కూడా ఇప్పుడు ఇక్కడొక కొత్త నాయకుడు. ఇక వైసిపి ప్రాబల్యంతో నాయకుడుగా ఎదుగుతున్న యువకుడు పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి. బిజెపి నుండి వైయస్‌ఆర్‌సిపిలోకి వచ్చిన యువతరం నాయకుడు శ్యాం. ఇటీవలే వచ్చిన యువ నాయకులు కనుమూరు రవిచంద్రారెడ్డి, హరిశ్చంద్రారెడ్డి సోదరులుకూడా ఆ కాషాయ పార్టీ నుండి వచ్చినవాళ్లే.

ఇక గూడూరు మున్సిపాలిటీలో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించి చైర్మన్ పదవులను అధిష్టించిన మహిళా నాయకురాళ్లు కోడూరు కల్పలత, పొణకా దేవసేనమ్మలు. వీరి పతిదేవుళ్లు కోడూరు మీరారెడ్డి, పొణకా శివకుమార్‌రెడ్డిలది కూడా గూడూరు రాజకీయాలలో ప్రధాన భూమిక. మీరారెడ్డయితే జనార్ధనరెడ్డి హయాం నుండి తగిన గుర్తింపు కోసం పోరాడుతూనే వున్నాడు.

ఇప్పుడు తాజా పరిణామాలను ఒకసారి పరిశీలిస్తే 2019లో జరిగిన ఎన్నికలలో అనూహ్యంగా తిరుపతి పార్లమెంటు స్థాయినుండి గూడూరు అసెంబ్లీ స్థానానికి వరప్రసాద్ దిగివస్తే గూడూరు అసెంబ్లీ స్థానం నుండి తిరుపతి పార్లమెంటు స్థాయికి బల్లి ఎగబాకాడు.

గూడూరులో ఎప్పుడూ మొదటి శ్రేణిలో పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు ఉంటే ద్వితీయ శ్రేణిలో ఈ నాయకగణమంతా వుంటారు. ఇక తృతీయ శ్రేణిలో ఆయా నాయకుల ఫాలోయర్లు పార్టీ కార్యకర్తలు క్రిందిస్థాయి పార్టీ వర్కర్లు వుంటారు.

ఇప్పుడు గెలిచిన రెండవ రోజునుండి వరప్రసాద్ బాహాటంగానే గల్లాపెట్టి తెరవడంతో ఇక్కడ నాయక గణం అంతా ఆయనకు దూరమై పోయింది. ద్వితీయ శ్రేణి నాయకులంతా యంయల్ఏని వ్యతిరేకిస్తున్నారని గ్రహించిన బల్లి దుర్గాప్రసాద్ తన రాజకీయ చతురతనంతా ప్రదర్శించి వరప్రసాద్‌కి దూరంగా వున్న నాయకులందరూ తనకు దగ్గరే అనే ప్రచారం మొదలు పెట్టి బాహాటంగానే వరప్రసాద్‌ని విమర్శించడం మొదలుపెట్టాడు. బల్లి దుర్గాప్రసాద్ గూడూరు నియోజకవర్గంలో పట్టున్న నాయకుడు కావడమే కాకుండా రాజకీయాలలో ఆరితేరిన చంద్రబాబు స్కూల్ నుండి వచ్చిన వాడు కావడంతో పరిస్థితులను తనకు అనుకూలంగా తిప్పుకోవడంలో విజయం సాధించాడు.

నిజానికి అధిష్టానం వద్ద ఎవరికి వున్న పలుకుబడి వారు వాడుకుని తమ వర్గం వారికి పదవులు ఇప్పించుకుంటున్నారు. ముఖ్యంగా జిల్లా ఇన్‌చార్జి సజ్జల రామకృష్ణారెడ్డి ద్వారా ఈ నియోజకవర్గ నాయకులు తమ పనులు చక్కబెట్టుకుంటున్నారు. తాను ప్రతిపాదించిన వ్యక్తులకు కాకుండా వేరేవాళ్లకి పదవులు రావడం, తాను అనుకున్న వాళ్లకు రాకుండా ఇతరులకు కాంట్రాక్టు పనులు రావడం వరప్రసాద్‌కి మింగుడుపడలేదు. దీంతో ఇప్పుడు విషయం అధిష్టానం వద్దకు వెళ్ళింది బత్తిన విజయకుమార్, సిద్ధారెడ్డి జనార్దన్‌రెడ్డి, ఓడూరు బాలకృష్ణారెడ్డి, నల్లపరెడ్డి వినోద్ రెడ్డిలతో కలిసి వరప్రసాద్ ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయడం, దీనంతటికీ కారణం సజ్జల అని చెప్పడంతో జగన్ ఈ పంచాయతీని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి బదిలీ చేశాడు.

## కార్యకర్తల్లో అయోమయం..

ఎంపి, యంయల్ఏ మధ్య వ్యక్తిగతంగా ఏ విబేధాలు లేకపోయినప్పటికీ ద్వితీయ శ్రేణి నాయకుల మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరుని యంపి, యంయల్ఏల ప్రత్యక్ష పోరుగా వూహించుకుంటున్న తృతీయ శ్రేణి అంటే మండల, గ్రామ స్థాయి నాయకులూ కార్యకర్తలు ఇప్పుడు తాము ఎటువైపు వెళ్లాలో అర్థం కాక అయోమయంలో పడిపోయారు. వాళ్లిద్దరూ ఒకే పార్టీకి చెందిన వాళ్ళు కావడంతో మధ్యలో వీరి పరిస్థితి దీనంగా మారిపోయింది.

ఒకరిద్దరు నాయకులు ఉన్నచోటే రాజకీయ సమస్యలు పరిష్కారించాలంటే చాలా కష్టం, అలాంటిది గూడూరు నియోజకవర్గంలో అందరూ నాయకులే, అందరికీ అధిష్టానం దగ్గర పలుకుబడి వుంది, ఎవరి స్థాయిలో వాళ్లు తమ పరపతి చూపించేవారే. ఇలాంటి నియోజకవర్గ పోరుని జగన్ ఇప్పుడు విపిఆర్ ముందుంచాడు. ఈ సమస్య విపిఆర్‌కి అగ్ని పరీక్ష లాంటిదే.

# పస్తులతో...

# కష్టజీవుల విలవిల!

- పనులు లేక బ్రతుకు భారం
- అవస్తలతోనే.. కుటుంబ జీవనం




**కరోనా మహమ్మారి వ్యాధి కష్టజీవుల బతుకులను మరింత దయనీయంగా మారుస్తోంది. అసలే కూలిపనులు అంతంత మాత్రంగా దొరికే ఈ రోజుల్లో ఈ కరోనా దెబ్బతో ఎవరూ పనులకు పిలవకపోతుండడంతో వేలాదిమంది నిరుపేద కూలీలు తమ కుటుంబాలను పోషించుకోవడానికి నానా ఇబ్బందులుపడుతున్నారు.**

ఎక్కడైనా పని దొరుకుతుందేమో అని వెతుకులాడుతున్నా కష్టజీవులకు, ముఖ్యంగా పట్టణంలోని శ్రామికులకు పనులు దొరకడం లేదు. దీంతో వారితో పాటు వారి పిల్లలు, కుటుంబం అంతా పస్తులతోనో లేదంటే అప్పులతోనో రోజులు గడపాల్సి వస్తోంది. మామూలు రోజుల్లోనైతే నిత్యం తెలతెలవారుతుండగానే రోడ్లపై ఏదో ఒక కూడలిలో కష్టజీవులంతా ఒకచోట చేరి పనుల కోసం నిరీక్షిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండేవారు. ఏ పని చేయాలన్నా ఆ పనులు చేసిపెట్టేవారికి కొదవ లేకుండా ఉండేది. ఇళ్ళ నిర్మాణాలు తదితర పనులకు ఎంతోమంది సిద్ధంగా ఉండేవారు. ఇప్పుడు వారంతా రోజువారీ పనుల కోసం రోడ్లపైకి వస్తున్నా పనులకు పిలిచేవారు కరువవుతుండడంతో నిత్యం ఎంతోమంది పనులు లేక నిరాశతోనే ఇళ్లకు వెళుతున్నారు. ఆకలితోనే రోజులు గడుపుతున్నారు. ప్రభుత్వం ఇకనైనా ఈ అభాగ్యుల దుస్థితిని పట్టించుకుని ఆ కష్టజీవుల కుటుంబాలను ఆదుకునేందుకు, వారికి జీవనోపాధికి ఇబ్బందులు లేకుండా ఉపాధిహామీ వంటి పనులను కేటాయించేందుకు మానవతా దృక్పధంతో వెంటనే తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ కష్టకాలంలో కష్టజీవులను అన్నివిధాలా ఆదుకోవాల్సి ఉంది.

## వ్యాపారాలు జరగక లబోదిబో...

ఇదిలావుంటే, మరోవైపు చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేవారి పరిస్థితి కూడా ఈ కరోనా రోజుల్లో ఎంతో దయనీయంగా ఉంది. 'అసలే కరోనా!.. ఎప్పుడు ఎవరి నుంచి వస్తుందో ఏమో'.. అని అందరూ బెంబేలెత్తి పోతున్న ఈ పరిస్థితుల్లో చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేవారు తమ వ్యాపారాల్లో లేదా దుకాణాల్లో తమకు అవసరమైనవారిని పనిలో నియమించుకునేందుకు కూడా సందేహిస్తున్నారు. మరోవైపు కరోనా విజృంభిస్తూనే ఉండడంతో నగరంలోనూ, జిల్లావ్యాప్తగా కూడా కంటైన్‌మెంట్ జోన్లు రోజురోజుకీ పెరుగుతుండడం, ఆయా ప్రాంతాల్లో తప్పనిసరిగా దుకాణాలు, వ్యాపారాలు మూతపడుతుండడంతో చిన్న వ్యాపారులు పడే బాధలు వర్ణనాతీతం. చిన్నచిన్న హోటళ్ళు, దుకాణాలు వగైరాలు మూతపడుతుండడంతో వాటిలో పనిచేసేవారికి జీవనోపాధి కరువైపోయింది.

మరోవైపు ఆయా వ్యాపారులు తమ దుకాణాలను మూతవేసుకున్నా అద్దెల భారం మాత్రం తప్పడం లేదు. అటు దుకాణాలు లేక, ఇటు నెలనెలా పెరిగిపోతున్న అద్దెలను కట్టలేక చిన్న వ్యాపారులు పడే బాధలు అన్నిన్ని కావు. ఒకవేళ దుకాణాలు అక్కడక్కడా తెరిచినా కరోనా ప్రభావంతో జనం బయటకు రాలేకపోతుండడంతో వ్యాపారాలు జరక్క మరో అవస్త. ప్రజలు కూడా గతంలో వలె ఇళ్ళనుంచి బయటకు రావడం లేదు. కరోనా ప్రభావంతో జనజీవనం బాగా స్తంభించిపోతోంది. స్వీయ నియంత్రణ పాటిస్తూ, ప్రభుత్వాల నిబంధనలు అనుసరిస్తూ ఇళ్ళలోనే ఉండిపోతున్నారు. ఏవైనా నిత్యావసర వస్తువులు, లేదా అత్యవసర వస్తువుల కోసం మాత్రం దుకాణాలకు వెళ్తున్నారు. దీంతో ఇతరత్రా దుకాణాలవారు దుకాణాలు తెరచినా ఫ్యాన్లు తిరిగి, లైట్లు వెలిగీ కరెంటు బిల్లులు పెరగడం తప్ప ఎలాంటి ఉపయోగం ఉండడం లేదు. అయితే, అన్నిటికన్నా ముందు కరోనా బారిన పడకుండా ప్రాణాలు రక్షించుకోవడమే ముఖ్యం కనుక.. అందరూ ఉగ్గబట్టి ఈ కష్టాలు నష్టాలన్నిటినీ భరిస్తూ ఉన్నారు. ఈ కరోనా రాకాసి ఎప్పుడు పోతుందో.. ఈ కష్టాలెప్పుడు పోతాయో దేవుడా అనుకుంటూ ఆ భగవంతుని వేడుకుంటున్నారు.

### జిల్లా అభివృద్ధిపై
# కలెక్టర్‌తో చర్చించిన విపిఆర్



జిల్లాకు కొత్త కలెక్టర్‌గా నియమితులైన కెవిఎన్ చక్రధర్‌బాబును రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) ఈనెల 19న నెల్లూరులోని ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో కలసి జిల్లా అభివృద్ధిపై చర్చించారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజాసంక్షేమ పథకాలన్నిటినీ సక్రమంగా అమలుచేయాలని, సంక్షేమఫలాలు ప్రజలకు అందేలా చూడాలని ఆయన కలెక్టర్‌కు సూచించారు. కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ పొందిన చక్రధర్‌బాబును విపిఆర్ ఈ సందర్భంగా అభినందించారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నవరత్నాలు' పథకాల అమలుతో పాటు ఇళ్ళస్థలాల పంపిణీ కార్యక్రమం విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలను వారు చర్చించారు. జిల్లాలో కరోనా రోజురోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో కరోనా కట్టడికి తీసుకోవాల్సిన చర్యలను వారు చర్చించుకున్నారు.

### కరోనా బారిన పడకుండా
# పోలీసులూ!.. తస్మాత్ జాగ్రత్త!

**- హెచ్చరించిన జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్**



జిల్లాలోని పోలీసులంతా ఒకే కుటుంబమని, ఎవరూ కరోనా బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఉండాలని, పోలీసులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనదేనని, ప్రతి ఒక్కరూ స్వీయ రక్షణ చర్యలు పాటించాలని, పోలీస్‌స్టేషన్లలోని సిబ్బందికి కరోనా సోకితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ పోలీసు అధికారులకు సూచించారు. ఈనెల 18న ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో సిబిడి, ఏసిబి, ఇంటలిజెన్స్, రైల్వే, జెన్‌కో, ట్రాన్స్‌కో తదితర అధికారులతో కరోనా నియంత్రణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించాల్సిన బాధ్యత ఆయా శాఖల అధికారులపై ఉందని స్పష్టం చేశారు. అధికారులు, సిబ్బంది ఈ వ్యాధి పట్ల ఎంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు అవసరమైన శానిటైజర్లు, మాస్కులు, థర్మల్ స్కానర్లు అందించామని, వీటిని తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో ఏఎస్పీ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

### కరోనా సోకిన వైద్యులు, సిబ్బందికి ..
# ప్రత్యేకవార్డులో సేవలందించాలి

కరోనా సోకిన వైద్యులు, నర్సులు, ఆశ కార్యకర్తలు, ఇతర వైద్య సిబ్బందికి వెంటనే ఒక ప్రత్యేక వార్డును కేటాయించేలా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డాక్టర్ల సంఘం నాయకులు జిల్లా ఇన్‌చార్జి డిఎంఅండ్‌హెచ్‌ఓ స్వర్ణలతను కోరారు. ఈనెల 19న వారంతా కలసి ఆమెకు వినతి పత్రం అందజేశారు. కరోనా బారిన పడ్డ వైద్య సిబ్బంది కోలుకుని తిరిగి విధుల్లోకి వచ్చేలా వారికి ప్రత్యేకవార్డులో వైద్య సేవలందించాలని సూచించారు. పిఓడిటి ఉమామహేశ్వరి, డిప్యూటీ మాస్ మీడియా అధికారి ధర్మేంద్ర, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు షఫీవుల్లా పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

### తినుబండారాల దుకాణంలో..
# బూజుపట్టిన రసగుల్లాలు

**- జరిమానా విధించిన హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ**

నెల్లూరు నగరంలోని కిసాన్ నగర్, మైపాడు గేటు, నవాబుపేట తదితర ప్రాంతాల్లోని తినుబండారాల దుకాణాల్లో నగరపాలకసంస్థ హెల్త్‌ఆఫీసర్ వెంకటరమణ ఆకస్మికంగా తనిఖీలు చేసి ఓ దుకాణంలో ముక్కిపోయిన రసగుల్లాలు చూసి మండిపడ్డారు. ఈనెల 18న ఈ తనిఖీలను ఆయన నిర్వహించారు. గడువు దాటిన మిఠాయిలు బూజ పట్టి ఉండడంతో వాటిని అక్కడనుంచి డంపింగ్‌యార్డ్‌కు తరలించి, సంబంధిత యజమానికి జరిమానా విధించారు. స్వీట్స్ దుకాణాల వద్ద పనిచేసేవాళ్ళు కరోనా నియంత్రణ నిబంధనలు పాటించకపోవడం, ముఖ్యంగా మాస్కులు కూడా ధరించక పోవడంతో ఆయన మండిపడ్డారు. ప్రజలు ఎంతో ఇష్టంతో కొనుగోలు చేసే తినుబండారాలు నాణ్యమైన రీతిలో ఉండాలని, నిర్లక్ష్యంతో ఉంటే తగు చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

### సేవాసదన్ చిన్నారులకు
# మాస్కులు పంపిణీ

నెల్లూరులోని మహిళా ప్రాంగణం వద్ద ఉన్న సేవాసదన్‌లోని చిన్నారులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఈనెల 21న మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేశారు. హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ కరోనా నేపథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. సేవాసదన్ అధికారి కాంతిరెడ్డి, మహిళా ప్రాంగణం మేనేజర్ విజయలక్ష్మి, సుబ్బారావు, ప్రవీణ్ పాల్గొన్నారు.

# డ్రైవర్లకు శానిటైజర్ కిట్లు

రవాణాశాఖ వారి ఆధ్వర్యంలో వాహనాల డ్రైవర్లకు ఈనెల 20న శానిటైజర్, గ్లౌజులు, మాస్కులతో కూడిన కిట్‌లను అందజేశారు. గొలగమూడి రోడ్డులో ఉన్న ఫిట్‌నెస్ ప్రాంగణంలో మోటార్ వాహనాల అధికారి మాదవరావు ఈ ఫిట్‌నెస్ కేంద్రానికి వచ్చిన పలువురు డ్రైవర్లకు ఈ కిట్‌లను అందజేశారు. డ్రైవర్లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

### వైకాపా లీగల్‌సెల్
# సభ్యునిగా రవికుమార్

వైయస్సార్‌సిపి లీగల్‌సెల్ రాష్ట్ర కమిటీ సభ్యునిగా నెల్లూరు నగరానికి చెందిన న్యాయవాది కుడుమల రవికుమార్‌కు స్థానం లభించింది. పార్టీ కేంద్ర కార్యాలయం ఆయన్ను లీగల్‌సెల్ రాష్ట్ర కమిటీ సభ్యునిగా నియమించడంతో నెల్లూరులోని పలువురు న్యాయవాదులు, ఆయన సన్నిహితులు సంతోషం వ్యక్తం చేస్తూ అభినందించారు. రవికుమార్ గతంలో వైకాపా లీగల్ సెల్ జిల్లా అధ్యక్షునిగా పనిచేశారు కూడా. తనకు రాష్ట్ర కమిటీలో స్థానం కల్పించినందుకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# 28న చలో తిరుపతి

విద్యుత్ సంస్థలో విధులు నిర్వహిస్తున్న మీటర్‌రీడర్ల సమస్యల పరిష్కారానికి ఈనెల28న చేపట్టిన 'చలో తిరుపతి' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, అక్కడ సిఎండి కార్యాలయం వద్ద తమ సమస్యలను విన్నవిస్తామని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు పిలుపునిచ్చారు. ఈనెల21న నెల్లూరులోని విద్యుత్‌భవన్ వద్ద మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలంటూ ఆంధ్రప్రదేశ్ మీటర్‌రీడర్ల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టి, తమ సమస్యలను ఎస్ఇ విజయకుమార్‌రెడ్డికి విన్నవించారు. యూనియన్ నాయకులు హజరత్ అలీ, రామయ్య, బాలకృష్ణ, శ్రీనివాసులు, సతీష్, సుబ్బయ్య, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

### వ్యాధులపై సర్వేకి
# సిద్ధంగా ఉండాలి

**- వైద్య ఆరోగ్యశాఖ జేడీ రాజేంద్రప్రసాద్**

మధుమేహం, లెప్రసీ, గుండె జబ్బులు, బిపి, క్యాన్సర్ తదితర వ్యాధులపై ఈనెల 25 నుంచి వచ్చే నెల 16వరకు ఇంటింటి సర్వే చేసేందుకు వైద్య అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ ఇటీవల జిల్లా వైద్య అధికారులకు సూచించారు. సర్వేకి సంబంధించి పబ్లిక్‌హెల్త్ సిబ్బందికి ముందుగానే శిక్షణ ఇవ్వాలని, ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు, గ్రామీణ ప్రాంతాల్లో రోజూ 30 ఇళ్ళ వంతున, పట్టణ ప్రాంతాల్లో 40 ఇళ్ళ వంతున సర్వే చేసి ఆ వివరాలను ఏఎన్ఎంలు ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

### ● ఆకస్మిక తనిఖీ



### పెద్దాసుపత్రిలో..
# అన్నం తిన్న అనిల్

కరోనా బాధితులకు మంచి ఆహారాన్ని అందించాలని, రోగులకు మెరుగైన సదుపాయాలు కల్పించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డా.పి.అనిల్‌కుమార్‌యాదవ్ హెచ్చరించారు. ఈ నెల 19న ఆయన నెల్లూరు నగరంలోని పెద్దాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెద్దాసుపత్రలో ఉన్న కరోనా రోగులకు మంచి సదుపాయాలు కానీ, ఆహారం కానీ సక్రమంగా ఉండడం లేదని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో మంత్రి కోవిడ్ సెంటర్‌లలో ఈ తనిఖీలు చేపట్టారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్యపరిస్థితులను పరిశీలించారు. రోగులకు ఇచ్చే ఆహారాన్ని తిన్నారు. రోగులకు అందజేసే ఆహారం మెనూను మార్చాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్‌రెడ్డిను ఆదేశించారు. రాత్రిపూట భోజనంతో పాటు పాలు కూడా ఇవ్వాలని చెప్పారు. సకాలంలో భోజనంతో పాటు మందులను సక్రమంగా ఇవ్వాలన్నారు. కరోనా నియంత్రణకు అందరూ అన్నివిధాల సహకరించాలన్నారు. కోవిడ్ నోడల్ అధికారి డాక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి అనిల్‌ను కలిసిన..కొత్త కలెక్టర్



కొత్త కలెక్టర్‌గా నియమితులైన ఏవిఎన్ చక్రధర్‌బాబు ఈనెల 19న నెల్లూరు నగరంలోని ఇస్కాన్‌సిటీ క్యాంప్ కార్యాలయంలో ఉన్న మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్‌ను గౌరవపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిస్థితుల గురించి ఆయన మంత్రితో చర్చించారు. కరోనా కట్టడికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు అనుగుణంగా జిల్లాలో ఈ వ్యాధి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను ఈ సందర్భంగా మంత్రి కలెక్టర్‌తో చర్చించారు.

### డా. అంబేద్కర్ రాజగృహంపై
# దాడిచేసిన వారిని శిక్షించాలి

**- దివ్యాంగుల ఆందోళన**

మహారాష్ట్రలోని డా.బాబా సాహెబ్ అంబేద్కర్ రాజగృహంపై దాడులు చేసినవారిని కఠినంగా శిక్షించాలంటూ నెల్లూరులోని విహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌నాయుడు డిమాండ్ చేశారు. ఈనెల 18న నెల్లూరులోని విఆర్‌సి సెంటర్‌లో ఉన్న డా. అంబేద్కర్ విగ్రహం ఎదుట వికలాంగుల హక్కుల పోరాటసమితి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. డా. అంబేద్కర్ రాజగృహంపై దాడులు చేయడం దారుణమని వారు నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మార్పీయస్ జిల్లా అధ్యక్షుడు మందా పెంచలయ్య, దివ్యాంగుల ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళిగౌడ్, మహిళా అధ్యక్షురాలు ఉమామహేశ్వరి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ప్రసాద్, స్వర్ణదీపం చారిటబుల్‌ట్రస్ట్ నిర్వాహకులు రఫీ, రమేష్ , రెహమాన్ పాల్గొన్నారు.

## కరోనా పరీక్షల కోసం.. దేశంలో ఎక్కడా లేని విధంగా..

# 'సంజీవని' బస్సులు

### - ప్రారంభించిన మంత్రి అనిల్, కలెక్టర్ చక్రధర్‌బాబు



రాష్ట్రప్రభుత్వం కరోనా పరీక్షల కోసం సంచార సంజీవని బస్సులను ఏర్పాటు చేసిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఈనెల 20న నెల్లూరులో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుతో కలిసి మంత్రి ఈ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ బస్సులో ఒకేసారి పది మందికి కరోనా వైద్యపరీక్షలు చేయవచ్చని, రోజుకు 700 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు చేసేందుకు వీలవుతుందని, క్షేత్ర స్థాయిలో పరీక్షల నిర్వహణకు ఈ బస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఈ సంచార సంజీవని బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చారని మంత్రి కొనియాడారు. కోవిడ్ సెంటర్లలో రోగులకు మంచి ఆహారం పెట్టేలా చర్యలు తీసుకున్నామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. జిల్లాలో రోజుకు దాదాపు 300 దాకా కేసులు వస్తున్నాయని, అధికారులు, వైద్యులు, పోలీసులు, పాత్రికేయులు కూడా బాధితుల్లో ఉన్నారని అంటూ ప్రజలందరూ ఈ పరిస్థితుల్లో కరోనా నివారణకు ప్రభుత్వం సూచించిన జాగ్రత్తలను తప్పని సరిగా పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, జేసీ ప్రభాకర్‌రెడ్డి, డిఆర్‌ఓ జి.మల్లికార్జున, ఇన్‌చార్జి డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ సుధాకర్ రెడ్డి, డాక్టర్ చెన్నయ్య, ఆర్టీసి ఆర్‌ఎం పి.వి శేషయ్య, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## కోవిడ్ నివారణకు యాక్షన్‌ప్లాన్

జిల్లాలో కోవిడ్ వైరస్ నివారణకు యాక్షన్‌ప్లాన్ తయారుచేసి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు జిల్లా అధికారులను ఆదేశించారు. ఈనెల 20న నెల్లూరునగరంలోని జడ్పీ ఆవరణంలో ఉన్న ఎమర్జెన్సీ కేంద్రంలో టాస్క్‌ఫోర్స్ అధికారులతో కలెక్టర్ సమావేశమై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రోజుకు కనీసం 4వేల పరీక్షలు చేసే విధంగా ల్యాబ్ సామర్ధ్యాన్ని పెంచాలన్నారు. యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా వలంటీర్లు ప్రతిరోజూ వారికి కేటాయించిన ప్రాంతాల్లో ఈ వ్యాధి అనుమానితులకు పరీక్షలు చేయించాలన్నారు. కరోనా పరీక్షల కోసం ప్రభుత్వం జిల్లాకు 7 సంజీవని బస్సులు కేటాయించిందని, ఈ వాహనాల ద్వారా అవసరమైన ప్రాంతాలకు వెళ్లి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలన్నారు. కరోనా నియంత్రణకు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ప్రజలు రోగనిరోధక శక్తి పెంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యంగా ఉన్నవారు కూడా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. రానున్న రెండు నెలలు అత్యంత కీలకమని, అధికారులు కూడా ముందుజాగ్రత్తలు తీసుకుంటూ ఈ వ్యాధి నివారణకు అత్యంత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. జేసీ డాక్టర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

## కంటైన్‌మెంట్ జోన్లలో నిబంధనలు పాటించాలి

కరోనా నియంత్రణలో భాగంగా కంటైన్‌మెంట్ జోన్లలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, ఏ ప్రాంతంలోనైనా కోవిడ్ వైరస్ సోకితే ఆ ప్రాంతంలోని 200 మీటర్లు కంటైన్‌మెంట్ జోన్‌గా ఉంటుందని, ఈ ప్రాంతాల్లో దుకాణాల వారు ఎలాంటి వ్యాపారాలు చేయరాదని వెంకటగిరి మునిసిపల్ కమిషనర్ జాలిరెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల ఆయన వెంకటగిరిలోని మునిసిపల్ కార్యాలయంలో వ్యాపారులతో సమావేశమై కరోనా మహమ్మారి వ్యాధి విజృంభణ గురించి చెప్తూ, ప్రజలందరూ తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, ప్రభుత్వం సూచిస్తున్న నియమ నిబంధనలను పాటించాలన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న తహశీల్దార్ ఆదిశేషయ్య మాట్లాడుతూ కోవిడ్ వైరస్‌కు సంబంధించి ప్రభుత్వ నిబంధనలను ఎవరైనా అధిగమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### కరోనా కట్టడికి..

## 363 కంటైన్‌మెంట్ జోన్లు

జిల్లాలో విజృంభిస్తున్న కరోనా మహమ్మారి వ్యాధిని నియంత్రించేందుకు జిల్లా ఉన్నతాధికారులు అన్ని ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. అయినప్పటికీ ఈ వ్యాధి రోజురోజుకు పెరుగుతూనే ఉంది. జిల్లావ్యాప్తంగా 44 మండలాల్లోని 363 గ్రామాలు, వార్డులను ఈనెల 20వ తేదీన జిల్లా ఉన్నతాధికారులు కంటైన్మెంట్ జోన్లుగా ప్రకటించి, ఆయాప్రాంతాల్లో కరోనా నియంత్రణకు మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో మొత్తం 47 మండలాలు ఉంటే వాటిలో 44 మండలాల్లో కరోనా విజృంభిస్తూండడం గమనార్హం. అందులో ముఖ్యంగా నెల్లూరు నగరంలోనే 83 కంటైన్మెంట్ జోన్లుండడంతో ఇక్కడ కరోనా ఎంతగా విజృంభిస్తోందో అర్థమవుతోంది. కరోనా నియంత్రణకు ప్రభుత్వాలు సూచించిన నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, స్వీయనిర్బంధంలో ఉండడం, మరీ అత్యవసరమైతే తప్ప ఇళ్ళలోంచి బయటకు రాకపోవడం, ముఖ్యంగా మాస్కులు ధరించడం, సామాజిక దూరం పాటించడం, తరచూ చేతులు శుభ్రపరుచుకోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి సూచనలు పాటించాలని, కరోనా పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు పదేపదే విజ్ఞప్తి చేస్తున్నారు.

## నిమ్మ మార్కెట్ ప్రారంభం

పొదలకూరులోని నిమ్మ మార్కెట్ ఎట్టకేలకు మళ్ళీ ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. కరోనా నేపథ్యంలో గత పదిహేను రోజులుగా మూతపడి ఉన్న మార్కెట్‌ను ఈనెల 23 నుంచి మళ్ళీ ప్రారంభిస్తున్నట్లు నిమ్మ వ్యాపారుల సంఘం కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 21న పేర్కొన్నారు. మార్కెట్ మూతతో నిమ్మరైతులు, హమాలీలు గత కొద్దిరోజులుగా ఎన్నో అవస్థలకు గురయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# పేదోళ్ళ దేవుడు కన్నుమూశాడు

### డాక్టర్ చిల్లకూరు మోహన్‌రెడ్డి ఇక లేరు



చిల్లకూరు వైద్య సోదరులలో మూడవ వాడు డాక్టర్ చిల్లకూరు మోహన్‌రెడ్డి జులై 22వ తేదీ తెల్లవారుజామున కన్నుమూశారు. ఆయన వయస్సు 84 సంవత్సరాలు. ఆయన ఆజన్మ బ్రహ్మచారి. కావలిలోని డాక్టర్ సివిఎస్ రెడ్డి, గూడూరులోని డాక్టర్ సిఆర్ రెడ్డిలకు మోహన్‌రెడ్డి తమ్ముడు కాగా, చెన్నైలోని ప్రముఖ



తమ్ముడు డా. సియంకె రెడ్డితో డాక్టర్ మోహన్‌రెడ్డి

వైద్యులు, తెలుగువారి ఆశా కిరణం డాక్టర్ ముద్దుకృష్ణారెడ్డికి మోహన్‌రెడ్డి అన్న. సిఎంకె రెడ్డికి ఈయన కేవలం అన్నే కాదు.. అన్నీ. ఆయనకు గురువు, దైవమే కాకుండా మార్గదర్శకుడు, స్ఫూర్తిప్రదాత.

లాయర్ పత్రిక వ్యవస్థాపకులు కీర్తిశేషులు తుంగా రాజగోపాలరెడ్డికి కూడా మోహన్‌రెడ్డి వరసకు తమ్ముడవుతాడు.

నెల్లూరు జిల్లా పెనుబల్లి గ్రామంలో 1936 జూన్ 23న చిల్లకూరు వెంకురెడ్డి, శేషమ్మల 6వ సంతానంగా ఆయన జన్మించాడు. ఆయన బాల్య విద్యాభ్యాసమంతా గూడూరులో జరిగింది. అనంతరం ఇంటర్మీడియెట్ చెన్నైలోని సర్ త్యాగరాయ కాలేజీలో చదివి, కీల్పాక్ మెడికల్ కాలేజీ నుండి వైద్య పట్టా పుచ్చుకున్నాడు. కొద్దికాలం రైల్వే శాఖలో ఉద్యోగం చేసి, అనంతరం 1968లో మదరాసులోని విల్లివాక్కంలో మోహన్ నర్సింగ్ హోమ్ పేరుతో ఆసుపత్రిని ప్రారంభించి, ప్రాక్టీసు మొదలుపెట్టాడు.

### 10 రూపాయల డాక్టర్..

చెన్నై మహానగరంలో విల్లివాక్కం ప్రాంతంలో డాక్టర్ మోహన్‌రెడ్డిని తెలియని గడప ఉండదంటే అతిశయోక్తి కాదేమో! ఆసుపత్రి ప్రారంభించిన నాటి నుండి పేదవారికి నాణ్యమైన వైద్య సేవలు తక్కువ ఖర్చుతో అందించడమే ధ్యేయంగా పని చేశాడు. ఆ ప్రాంతవాసులలో దేవుడిగా అవతరించాడు. ఆయన తీసుకునే ఫీజు 10రూపాయలే. పెళ్లి తన ఆశయానికి ఎక్కడ ఆటంకం కలిగిస్తుందోనన్న ఆలోచనతో పెళ్లి చేసుకోలేదు. 24గంటలూ రోగులకు అందుబాటులో ఉండేవాడు. విల్లివాక్కం పరిసర ప్రాంతాలలో మోహన్‌రెడ్డి సహాయం పొందని గుడి, బడి, మసీదు, చర్చిలు లేవన్నది అక్షర సత్యం. శ్రీ కనకదుర్గ తెలుగు స్కూళ్ళకి ఉపాధ్యక్షుడిగాను, కరస్పాండెంట్‌గాను సేవలందించాడు. అల్ ఇండియా తెలుగు ఫెడరేషన్ అన్ని కార్యక్రమాలకు ప్రధాన దాతగా తనవంతు సహాయం అందించేవాడు. మోహన్ గార్డెన్స్‌కి మేనేజింగ్ డైరెక్టర్‌గా కూడా వున్నాడు.

తమ స్వంత కళ్యాణమండపాలలో జరిగే అనేక పెళ్లిళ్ళు, శుభకార్యాల సందర్భాలలో రాత్రి 10గంటలు దాటినాసరే అక్కడ మిగిలిపోయిన ఆహారాన్ని వృథా కానీయకుండా తీసుకువెళ్లి విల్లివాక్కం ప్రాంతంలోని పేదవాళ్లకి పంచిపెట్టడం గత 15 సంవత్సరాలుగా ఆనవాయితీగా మార్చుకున్నాడు డాక్టర్ మోహన్‌రెడ్డి.

చెన్నై చిన్మయా మిషన్‌లో అన్ని సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవాడు. అప్పటి మద్రాసు గవర్నర్ కొణిజేటి రోశయ్యతో పాటు పలు సంస్థల నుండి కూడా అభినందన సత్కారాలను మోహన్‌రెడ్డి అందుకున్నాడు.

కరోనా మహమ్మారి విలయ తాండవం చేస్తున్న వేళ వైద్య సేవలు ఆపేయమని అందరూ వారించినా ఇలాంటి తరుణంలో మనం కూడా పేదవాళ్లకి అండగా ఉండకపోతే ఎలా అని తన సేవలు కొనసాగిస్తూనే వచ్చాడు. జూన్ 23న తన 84వ పుట్టినరోజున కుదా మురికివాడలలో నివసించే పేదవారికి తానే స్వయంగా వెళ్లి ఆహార పొట్లాలు అందించి వచ్చాడు.

మంచికే జీవిస్తూ మంచికోసమే తపిస్తూ అకస్మాత్తుగా తన వారందరినీ విడిచి వెళ్లిన డాక్టర్ మోహన్‌రెడ్డి ఆత్మ శాంతికి ప్రార్థిస్తూ ఆయన బంధుమిత్రులకి ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

### ఉప రాష్ట్రపతి వెంకయ్య సంతాపం

సామాజికవేత్తగా, వైద్యుడిగా, మానవతావాదిగా, తెలుగు భాషాభిమానిగా విశేష సేవలందించిన డాక్టర్ సి.మోహన్‌రెడ్డి మరణవార్త బాధ కలిగించింది. చివరిక్షణం వరకు పేదల డాక్టర్‌గా 10రూపాయల కన్సల్టేషన్‌తో చికిత్సనందించి సమాజం పట్ల ఉదారతను చాటుకున్న వ్యక్తి మోహన్‌రెడ్డి. జీవితాంతం బ్రహ్మచారిగానే ఉండి ఆసుపత్రిలోనే ఓ గదిలో ఉంటూ రోగులకు 24గంటలూ అందుబాటులో ఉన్న ఆయన అంకితభావం అభినందనీయం. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ.. వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి అంటూ ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు ఒక ప్రకటన ద్వారా మోహన్‌రెడ్డి మృతిపట్ల తమ సంతాపాన్ని వ్యక్తపరిచారు.



అప్పటి తమిళనాడు గవర్నర్ కొణిజేటి రోశయ్య నుండి సత్కారం అందుకుంటూ...



జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత చక్రధర్‌బాబు తొలిసారిగా ఈనెల 21న గూడూరులో పర్యటించి గాంధీనగర్‌లో ఎన్టీఆర్ స్వగృహ, వైయస్ఆర్ కాలనీలను పరిశీలించారు. తొలుత గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# లాక్‌డౌన్ అమలుకు సహకరించండి

**- పట్టణ సిఐ దశరధరామారావు**

కరోనా వైరస్ వ్యాప్తిని నియంత్రిం చేందుకు గూడూరు పట్టణంలో లాక్‌డౌన్ అమలులో ఉందని, ప్రజలందరూ సహక రించాలని పట్టణ సి.ఐ దశరధరామారావు కోరారు. మంగళవారం ఆయన పట్ట ణంలోని పలు కూడళ్ళలో పర్యటించి దుకాణాలను మూసివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అధికారుల సూచనల మేరకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 వరకు మాత్రమే దుకాణాలు తెరచి ఉంచాల న్నారు. మధ్యాహ్నం 12 తర్వాత దుకా ణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.





లాక్‌డౌన్ అమలును పర్యవేక్షిస్తున్న సి.ఐ దశరధరామారావు

**ఆపరేషన్ ముస్కాన్..**

బాలకార్మికుల చేత పనిచేయిస్తే చట్టపరమైన చర్యలు చేపడతామని సి.ఐ దశరధరామారావు అన్నారు. ఈ నెల18న ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత నాలుగు రోజు లుగా ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని తమ సిబ్బంది సహాయంతో చేపట్టి బాల కార్మికులను గుర్తించి, వారిని స్టేషన్‌కు తీసుకొచ్చి వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించామన్నారు. 14ఏళ్ళలోపు వాళ్ళను పనిలో పెట్టుకుంటే దుకాణదారులపై చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. ప్రభుత్వ నిబంధనలను వ్యాపారస్తులు ఆచరించి బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఒకటవ పట్టణ ఎస్.ఐ సైదులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు

**- మున్సిపల్ కమిషనర్ ఓబులేసు**



కరోనా మహమ్మారి చాపక్రింద నీరులా శరవేగంగా విస్తరిస్తున్నందున, ప్రభుత్వం కొన్ని నిబంధనలను జారీ చేసిందని, వాటిని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు చేపడతామని గూడూరు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు పేర్కొన్నారు. ఈనెల 20న గూడూరు మున్సిపల్ కార్యాల యంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ కరోనా వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలకు ప్రజలు, వ్యాపారస్తులు, అధికారులు సహక రించాలని కోరారు. నిత్యావసర వస్తువులను విక్రయించే దుకాణాలు ఉదయం 8గంటల నుండి 12 గంటల వరకే తెరచి వుంచాలని, దుకాణాల వద్ద తప్పనిసరిగా సామాజిక దూరం పాటించేలా వృత్తాకార గుర్తులను ఏర్పాటు చేయాలన్నారు. ఎవ్వరూ అనవసరంగా బయటకు రావద్దని పిలుపునిచ్చారు. బహిరంగ ప్రదేశాలలో ఉమ్మి వేయకూడదని, గుంపులు గుంపులుగా జనసమూహంగా ఉండకూడదని అన్నారు. బయటకు వచ్చేటప్పుడు విధిగా మాస్క్ ధరించాలన్నారు. మాస్క్‌ను ధరించకుంటే మొదటిసారి 200 రూపాయలు, రెండోసారి 500 రూపాయలు జరిమానా విధిస్తామని అన్నారు. ప్రతిఒక్కరూ విధిగా ప్రభుత్వ నిబంధనలను పాటించి, ఆరోగ్యకరమైన సమాజానికి కృషి చేయాలన్నారు.

# బాధితులకు ఆర్థిక సాయం



చెక్కును పంపిణీ చేస్తున్న కళ్యాణ చక్రవర్తి, రియాజ్ అహ్మద్

గూడూరు మున్సిపల్ ఉద్యోగి సందాని బాషా ఇటీవల మృతిచెందడంతో ఆయన కుటుంబసభ్యులను సోమవారం ఎంపి బల్లి దుర్గాప్రసాదరావు తనయుడు బల్లి కళ్యాణ చక్రవర్తి పరామర్శించాడు. రూ. 25వేలు ఆర్థిక సాయం అందజేశాడు. ఆంధ్రప్రదేశ్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు షేక్ రియాజ్‌అహ్మద్, వైకాపా నాయకులు శ్రీహరి, హరి, ముర్తుజా తదితరులు పాల్గొన్నారు.

# పండుగలన్నీ శ్రావణంలోనే

**డిఆర్‌డబ్ల్యు కాలేజీ రిటైర్డ్ లెక్చరర్ పిఎస్ రాజ్యలక్ష్మి**



శ్రావణ మాసం అనగానే ప్రతి ఇంటిలో లక్ష్మీదేవి తిరుగు తున్నట్టు అనిపిస్తుందని, అలాంటి శ్రావణ మాసం వస్తుందంటే ముఖ్యంగా ఇరు రాష్ట్రాల మహి ళామణులకు ఎంతో సంతోష మని అంటున్నారు గూడూరు డిఆర్‌డబ్ల్యు కాలేజీ రిటైర్డ్ లెక్చరర్ పిఎస్ రాజ్యలక్ష్మి. శ్రావణ మాసం నెలరోజుల కాలంలో ఆడపడుచులు ప్రతిరోజూ తమ ఇంటి ముందు ఉదయం, సాయంత్రం అందమైన ముగ్గులతో, పచ్చటి మామిడి తోరణాలతో, భగవన్నామస్మరణంతో, అందరి ఇళ్ళు అమ్మవారి పూజలతో కళ కళలాడుతాయని, మనకున్న పన్నెండు తెలుగు నెలల్లో ఐదవది అయిన శ్రావణ మాసం ఎంతో పవిత్రమైనదని, ఈ నెలలో పౌర్ణమినాడు చంద్రుడు శ్రవణా నక్షత్రంలో సంచరించడం వలన ఈ మాసానికి శ్రావణ మాసం అనే పేరు వచ్చిందని అన్నారు. ఈ శ్రావణ మాసం దేవాలయాల్లో అమ్మవార్లను దర్శించుకునే భాగ్యాన్ని కరోనా మహమ్మారి మహిళలకు దూరం చేసినందుకు చింతిస్తూ, అందరూ కరోనా కట్టడికి ప్రభుత్వం విధించిన నిబంధనలను తూ.చ తప్పకుండా పాటిద్దామన్నారు.

# మందు షాపును బంద్ చేయించారు





సైదాపురం మండలంలోని మర్లపూడి గ్రామంలో ఉన్న మద్యం దుకాణాన్ని ఇటీవల ఆ గ్రామప్రజలంతా కలసి మూసేయించారు. మద్యం కోసం ఇక్కడికి రాపూరు, గోనుపల్లి, మద్దిలమడుగు, లింగనపాళెం, చీకవోలు తదితర ప్రాంతాల నుంచి కూడా మద్యంబాబులు వస్తున్నారని, దీంతో తమ గ్రామంలో ఎక్కడ కరోనా వస్తుందోనని ప్రజలు ఆందోళనతో ఈ మద్యం షాపును మూసేయించారు.

# నరకం చూపిస్తున్న రైల్వేగేటు దారి



గూడూరు రెండో పట్టణం నుంచి ఒకటో పట్టణానికి వెళ్ళే తిరుపతి రైల్వేగేటు మార్గం వాహనదారు లకు నరకం చూపు తోంది. స్థానిక స్వర్ణ భారతీనగర్ ప్రాం తంలో గేటు సమీ పంలో రోడ్డు మార్గంలో మోకాటి ఎత్తు నీటి గుంత కారణంగా నిత్యం వాహనదారులు ప్రమాదాలకు గురవు తున్నారు. వర్షం పడినప్పుడు ఆ నీరు ఎటూ పోయే అవకాశం లేక నిలిచిపోతున్నాయి. రోడ్డు మధ్యలో గుంటలలో పడిపోతున్నారు. రెండో పట్టణంలోని గాంధీనగర్, ఇందిరానగర్, మాళవ్యానగర్, జానకిరాంపేట, తిలక్‌నగర్ ప్రాంతాలకు చెందిన ప్రజలు నిత్యం ఈ మార్గంలో ప్రయాణిస్తుంటారు. రోడ్డుపై ఉన్న నీటి మడుగులో గుంతలు ఉండటంతో అది తెలియక చాలామంది వాహనదారులు నిత్యం ఆ గుంతలో పడి గాయాలపాలవుతున్నారు. రైల్వేశాఖ పరిధిలో ఉన్న రోడ్డును ఎత్తు పెంచడమో లేదా ఇరువైపులా కాలువ ఏర్పాటు చేయడమో చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



కరోనా లాక్‌డౌన్ మరియు ఆషాఢ మాసం సందర్భంగా ఈదూరు గ్రామ దేవస్థానంలో పూజలు లేక ఇబ్బందిపడుతున్న అర్చకులకు ఒక నెలకు సరిపడా బియ్యం మరియు నిత్యావసర సరుకులను గ్రామంలోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానం, శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవస్థానాల ప్రాంగణంలో ఈ దేవస్థానాల ఛైర్మన్ రావి మోహన్‌చౌదరి సహకారంతో జూలై 16వ తేదీన అందజేస్తున్న రావి వెంకన్న

### ఆగస్టు 15 దాకా..

# పరిశుభ్రత పక్షోత్సవాలు

## - విజయవంతం చేయాలన్న డిపిఓ ధనలక్ష్మి

ఈనెల 24 నుంచి ఆగస్టు 15వ తేది వరకు పరిశుభ్రత పక్షోత్సవాలను పురస్కరించుకుని జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని జిల్లా పంచాయతి అధికారి ధనలక్ష్మి కోరారు. ఈనెల 18న నెల్లూరులోని జడ్పీ ఆవరణలో ఉన్న డిపిఓ కార్యాలయంలో పంచాయతి కార్యదర్శులు, ఈఓపిఆర్డీలతో ఆమె టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో 'మనం-మన పరిశుభ్రత' పైలెట్ ప్రాజెక్ట్ కింద నిర్ణీత సమయంలో సమస్యలను పరిష్కరించాలని, పారిశుద్ధ్యం, తాగునీరు, ఆరోగ్యసమస్యలను వెంటనే పరిష్కరించేందుకు టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా చేతుల పరిశుభ్రత, మాస్కులు వినియోగం, భౌతిక దూరం పాటించడం వంటి విషయలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. గ్రామాల్లో అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాలు, పిచ్చిచెట్లు, పొదలు, దోమల ఉత్పత్తికేంద్రాలను గుర్తించి వాటిని వెంటనే తొలగించాలని, తాగునీటి పైపుల లీకేజీలకు మరమ్మతులు చేయాలని, వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

# సమాజాన్ని చైతన్యవంతం చేసేదే కవిత్వం

**- విఎస్‌యు రిజిస్ట్రార్ ఎల్వీకె**




సమాజాన్ని చైతన్యవంతం చేసేదే కవిత్వమని విక్రమసింహపురి యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఎల్‌వి కృష్ణారెడ్డి అన్నారు. ఈనెల 20న ఆయన నెల్లూరులోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో నెల్లూరుజిల్లా రచయితల సంఘం(నెరసం) వారు ఏర్పాటుచేసిన పుస్తకావిష్కరణలో పాల్గొని స్థానిక నారాయణ దంతవైద్య కళాశాల హెచ్‌ఓడి డాక్టర్ ఎన్.కన్నన్ రచించిన 'మైండిట్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ అభ్యున్నతికి కవిత్వం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం పుస్తక రచయితను, ముఖ్యఅతిథులను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో రచయిత కన్నన్‌తో పాటు నెరసం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏ.జయప్రకాష్, పాతూరు అన్నపూర్ణ, దంత కళాశాల డీన్ డాక్టర్ శివకుమార్, ఆచార్య ఆదిత్య పాల్గొన్నారు.

### కోవిడ్ నిబంధనలు

# తప్పనిసరిగా పాటించాలి

## - జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు

కరోనా నియంత్రణలో ప్రజలు సహకరించాలని, ప్రతిఒక్కరూ కరోనా నియంత్రణ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు అన్నారు. కరోనా బాధితుల పట్ల వివక్ష తగదని, రానున్న రోజుల్లో కరోనా కేసుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకుని అందరూ కోవిడ్ నియంత్రణ చర్యలను కట్టుదిట్టంగా తీసుకోవాలని సూచించారు. బాధితుల్లో అత్యధికశాతం మంది కోలుకుంటున్నారని, ప్రజలు ప్రభుత్వం సూచించిన నిబంధనలు అనుసరించి కరోనాకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈనెల 18న కోవూరు మండలంలోని ఇనమడుగు, పడుగుపాడు గ్రామ పంచాయతీల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి కరోనా నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కరోనాపై ప్రజల్లో ఉన్న భయాందోళనలు తొలగించేందుకు వలంటీర్లు కృషిచేయాలన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు15న ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న పేదలకు ఇళ్ళ స్థలాల పంపిణీ లేఅవుట్లను అధికారులతో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు తహశీల్దార్ సిహెచ్ సుబ్బయ్య, ఎంపిడిఓ శ్రీహరి, ప్రత్యేకాధికారి శ్రీహరిరెడ్డి, పంచాయతి కార్యదర్శి కృష్ణమూర్తి, గ్రామ సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలుకు

# చర్యలు తీసుకోవాలి

## - కలెక్టర్‌కు రైతుసంఘాల నాయకుల వినతి

జిల్లాలో రెండవ పంట వరికోతలు ప్రారంభమయ్యే సరికల్లా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి రైతులను ఆదుకోవాలని రైతుసంఘాల సమాఖ్య నాయకులు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబును కోరారు. ఈనెల 18న ఆ సమాఖ్య నాయకులు కలెక్టర్‌ను కలిసి రైతులు నష్టపోకుండా కనీసం 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి చిరసాని కోటిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, హనుమంతరావునాయుడు, ఏవిఆర్ నాయుడు, సోమశేఖర్‌రెడ్డి ఉన్నారు.

# వేడుకగా.. పెంచలస్వామి కల్యాణోత్సవం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన రాపూరు మండలంలోని పెంచలకోనలో ఉన్న శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారి ఆలయంలో ఈనెల 18న ఆలయ అర్చకులు స్వామివారు-అమ్మవార్లకు ఎంతో వేడుకగా కల్యాణోత్సవం నిర్వహించారు. వేకువన 5 గంటల నుంచే శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామివారికి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి అమ్మవార్లకు, ఆలయం చెంతనే ఉన్న ఆంజనేయస్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం అభిషేక సేవలు, పూలంగిసేవలు చేశారు. ఉదయం 10.30 గంటలకు ఆలయ ప్రాంగణంలోని నిత్యకల్యాణ మండపంలో ఆదిలక్ష్మీదేవి-చెంచులక్ష్మీదేవిల సమేతంగా నృసింహస్వామిని కొలువుదీర్చి మంగళవాద్యాల నడుమ, వేదపండితుల మంత్రోచ్ఛరణలతో కనువిందుగా కల్యాణోత్సవం నిర్వహించారు. విచ్చేసిన భక్తులందరూ కల్యాణోత్సవం తిలకించి తరించారు. అనంతరం భక్తులకు మధ్యాహ్నం ఆహారపొట్లాలను అందజేశారు.

# శాకంబరిగా కొలువుదీరిన చాముండేశ్వరిదేవి

ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నం గ్రామంలో కొలువైవున్న శ్రీ చాముండేశ్వరి దేవి అమ్మవారికి ఈనెల 19న ఆలయ అర్చకులు ఎంతో శోభాయమానంగా శాకంబరి అలంకారం నిర్వహించారు. పలురకాలైన పండ్లు, కూరగాయలతో అమ్మవారి విగ్రహాన్ని, ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్ది, అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ అర్చకులు సుధీర్‌స్వామి, అనిల్‌స్వామి, రామకృష్ణస్వామి ఆధ్వర్యంలో, ఆలయ ఛైర్మెన్ కొండూరు కృష్ణారెడ్డి, ఇ.ఓ రవీంద్రరెడ్డి, పాలకమండలి సభ్యుల పర్యవేక్షణలో అమ్మవారికి ఈ వేడుక నిర్వహించారు. ఉభయకర్తలుగా నెల్లూరుకు చెందిన కొలపర్తి రమేష్, సువర్ణలత దంపతులు వ్యవహరించారు.

# సిఎం సహాయనిధి నుంచి బాధితులకు సాయం

సర్వేపల్లి నియోజకవర్గంలోని 56 కుటుంబాలకు చెందిన బాధితులకు 25.47 లక్షల రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థికసహాయంగా మంజూరైందని ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలియజేశారు. ఆ చెక్కులను ఆయన లబ్దిదారులకు ఈనెల 19న నెల్లూరులోని తన నివాసంలో అందజేశారు.

### మహా మహిమాన్వితం..

# మల్లాం..శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం



***జిల్లాలో మరో ప్రాచీనమైన..మహా మహిమాన్వితమైన క్షేత్రం.. చిట్టమూరు మండలంలోని 'మల్లాం' గ్రామంలో కొలువై ఉన్న శ్రీ వళ్ళీ-దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం. భక్తుల కొంగుబంగారంగా, కోరిన కోర్కెలు తీర్చే దైవంగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రసిద్ధి. శ్రీ సుబ్రహ్మణ్యస్వామి స్వయంభువుగా వెలసిన కోవెల ఇది. ఈ ఆలయాన్ని దర్శించుకున్న భక్తులకు అన్ని రకాల దోషాలు తొలగిపోయి.. సకల శుభాలు కలుగుతాయి. అంతేకాదు, కుజ దోష నివారణకు ఈ ఆలయం ఎంతో ప్రసిద్ధి. ఈ ఆలయం గురించి ఎన్నో పురాణగాథలు ఉన్నాయి.***



## మన దేవాలయాలు (5)

పూర్వకాలంలో ఈ ప్రాంతంలో మల్లాసుర, కొల్లాసుర అనే రాక్షసులు ప్రజల్ని హింసిస్తూ ఉండేవారని, ప్రజల ప్రార్థనలతో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఇక్కడ అవతరించి వారిని సంహరించి ప్రజలను రక్షించారని పురాణగాథల వల్ల తెలుస్తోంది. ఆ రాక్షసులను యుద్ధంలో సంహరించిన తర్వాత.. ఇక్కడ తపస్సు చేసుకుంటుండగా స్వామివారు కూర్చున్న చోటంతా పుట్టలాగా పెరిగి వెదురు బొంగులు మొలిచాయని, చోళరాజు ఒకరు ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు ఆ వెదురు బొంగులతో పల్లకీలు చేయించేందుకు వాటిని తీసుకురమ్మని సైన్యానికి చెప్పడం, సైనికులు వాటిని నరుకుతున్నప్పుడు స్వామివారి చేతులు కూడా తెగి నెత్తురు కారడం జరిగాయని, ఆ వెను వెంటనే రాజుతో సహా సైన్యమంతా కంటిచూపును కోల్పోయారని, ఆ రాత్రే స్వామివారు రాజుకు స్వప్నంలో కనిపించి తన బాహువులు తెగిన చోట ఆలయాన్ని నిర్మించాలని చెప్పి రాజుకు కంటి చూపును ప్రసాదించడంతో ఆ రాజు ఇక్కడ స్వామి వారికి ఈ ఆలయం నిర్మించాడని పురాణగాథల వల్ల తెలుస్తోంది.

### తిరుగుడు మల్లాం...

ఇక్కడ తూర్పు దిక్కుగాఉన్న నూరుకాళ్ళ మండపం దక్షిణదిక్కుకు తిరిగినందున దీనిని 'తిరుగుడు మల్లాం' అని కూడా అంటుంటారు. ఈ నూరుకాళ్ళ మండపాన్ని నిర్మించేందుకు రాజు తంజావూరు నుంచి తండ్రీకొడుకులైన ఇద్దరు శిల్పులను రప్పించారని, వారు తమ కళానైపుణ్యంతో రంగరించి శతస్తంభ మండపం వనులు చేశారని చెప్తుంటారు. ఇక్కడ మరో కథనం కూడా ఉంది. ఆ శిల్పి కుమారుడికి తంజావూరులో ప్రేయసి ఉండేదని, ఆమెను కలుసుకోవాలని ఒకరోజు రాత్రి ఆ మండపానికి ఉన్న గుర్రాలకు ప్రాణం పోసి రథాన్ని తిప్పుతుండగా, తండ్రికి కోపం వచ్చి గుర్రాల కాళ్ళను నరకడంతో ఆ రథం ఉత్తరం నుంచి దక్షిణానికి జరిగిందని, అందువల్ల కూడా దీనికి 'తిరుగుడు మల్లాం' అనే పేరు వచ్చిందనే గాథలు కూడా ప్రచారంలో ఉన్నాయి.



### ప్రాచీన శిల్పకళా వైభవానికి ప్రతీక:

మల్లాం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయం ప్రాచీన శిల్పకళా వైభవానికి ప్రతీకగా ఉంటుంది. మనోహరమైన శిల్పాలతో, వసంత మండపం, రాతిరథం వంటి అత్యద్భుతమైన నిర్మాణాలతో భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. రామాయణ భారత భాగవత ఘట్టాలను వివరిస్తూ మనోహరంగా నిర్మించిన శతస్తంభాల కల్యాణమండపం (నూరుకాళ్ళ మండపం) మండపం భక్తులను ఎంతగానో ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది. ఈ ఆలయం 11వ శతాబ్దినాటి చోళరాజుల కాలంలో నిర్మించినట్లు తెలుస్తోంది.

### కుజ దోష నివారణకు ప్రసిద్ధి

ఇక్కడ స్వామివారు శ్రీవళ్ళీ దేవసేన అమ్మవార్లతో కలసి వెలసి ఉన్నారు. సంతానం లేనివారు ప్రతి ఏటా స్వామి వారి బ్రహ్మోత్సవాలప్పుడు ధ్వజారోహణ సమయంలో కొడిముద్దను ప్రసాదంగా స్వీకరించి సంతానం పొందుతూ ఉంటారు. ఈ ఆలయం ప్రత్యేకించి కుజదోష నివారణకు ప్రసిద్ధి. రోజూ 108 ప్రదక్షిణలు వంతున 40 రోజులు చేస్తే ఎలాంటి వ్యాధి అయినా నయం కావడం ఖాయం. ఏదేమైనా తెలుగునాట మరెక్కడా మల్లాం వంటి ప్రాచీనమైన, మహిమాన్వితమైన శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయం మరొకటి లేదనే చెప్పవచ్చు.

వీక్షణం - మంజీర

## రాజస్థాన్ సంక్షోభం

# మునిగే పుట్టికి తారు తాపడం

దేశం మొత్తం చూపులూ ఇప్పుడు రాజస్థాన్ మీదనే కేంద్రీకృతమయ్యాయి. అన్ని వేళ్ళూ బీజేపీనే చూపిస్తున్నాయి. బీజేపీ మాత్రం మౌనమే ప్రస్తుతానికి శ్రేయస్కరం అనుకుంటోంది. అయినా.. కెమెరాలన్నీ అటు తిరిగి ఇటు తిరిగి వసుంధరరాజే దగ్గరకు వచ్చి ఆగుతున్నాయి.

### తొలి శకం

రాజస్థాన్‌లో కాంగ్రెస్, బీజేపీల కుర్చీలాట చాలా స్పష్టంగా ఉంటుంది. పాకిస్థాన్ సరిహద్దులో ఉండడం వల్ల పాక్- భారత్ యుద్ధాలు స్థానిక రాజకీయాల మీద తీవ్రమైన ప్రభావాన్నే చూపుతుంటాయి. 1971లో జరిగిన ఎన్నికల ఫలితాలను భారత్-పాక్ యుద్ధం శాసించింది. కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని విజయాన్ని కట్టబెట్టింది. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ప్రకటించిన సమయంలో భైరాన్‌సింగ్ షెకావత్ వంటి కీలకమైన నాయకులు జైలు పాలయ్యారు. షెకావత్ జైలు పాలవడాన్ని తీవ్రంగా పరిగణించింది రాజస్థాన్. రెండు వందల సీట్లు ఉన్న శాసనసభలో షెకావత్ ఆధ్వర్యంలోని జనతాపార్టీకి 151 సీట్లు కట్టబెట్టింది ఆ రాష్ట్రం. ఇందిరాగాంధీ 1980లో షెకావత్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసింది. జనతాపార్టీ చీలికలను ప్రోత్సహించింది. 1985 ఎన్నికల్లో కాంగ్రెస్ విజయఢంకా మోగించడానికి కారణం కేవలం ఆ ముందటి ఏడాది ఇందిరాగాంధీ హత్య మాత్రమే. ఆ తర్వాతి ఎన్నికల నాటికి షెకావత్ ప్రభంజనం గెలుపును శాసించింది. బీజేపీ- జనతాదళ్ భాగస్వామ్యం 140 అసెంబ్లీ స్థానాలను, 25 లోక్‌సభ స్థానాలను గెలుచుకుంది. షెకావత్ రెండోసారి సీఎం అయ్యారు. జనతాదళ్ మద్దతు ఉపసంహరణ వంటి క్లిష్టతలను ఎదుర్కొని నిలబడిన షెకావత్ ప్రభుత్వాన్ని కేంద్రంలో ఉన్న పీవీ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అప్పుడు కాంగ్రెస్‌పార్టీ చేసిన ఆరోపణ, పీవీ ప్రభుత్వం చూపించిన కారణం బాబ్రీ మసీదు విధ్వంసం. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించడమైంది. 1989లో ఏర్పడిన ప్రభుత్వం 1992 నాటికి అధికారం నుంచి తప్పుకుంది. ఆ తర్వాత ఏడాది ఎన్నికలు వచ్చాయి. ఆ ఎన్నికల్లో షెకావత్‌కు మెజారిటీ వచ్చింది కానీ మ్యాజిక్ ఫిగర్‌కు చేరలేదు. ఇండిపెండెంట్ల సహాయంతో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి మూడవసారి సీఎం పీఠం ఎక్కారు షెకావత్. నిజానికి సంఖ్యాపరంగా చూస్తే ఏ క్షణమైనా రాజకీయ అనిశ్చితి తలెత్తగలిగిన పరిస్థితి అది. అయినా ఎటువంటి రాజకీయ క్లిష్టతలూ తలెత్తలేదు. రాష్ట్రం కానీ పాలకులు కానీ గర్వంగా చూపించుకోగలిగిన అభివృద్ధికి అవకాశం ఇచ్చిన ఐదేళ్ల కాలం అది. అయితే, 1998లో ఎన్నికలకు ముందు ఉల్లిపాయల ధరలు చుక్కల్ని చూపాయి. ఫలితాలు కూడా షెకావత్‌కు చుక్కల్ని చూపించాయి. అప్పుడు కాంగ్రెస్ గెలిచింది. అశోక్ గెహ్లాత్ ముఖ్యమంత్రి అయ్యారు.

### మలిశకం

రాజస్థాన్ రాష్ట్ర ప్రజలు శాసనసభ ఎన్నికలకు పార్లమెంట్ ఎన్నికలకు ఒకే రకంగా ఓటు వెయ్యడం లేదు. 1998లో కాంగ్రెస్‌కు మెజారిటీ సీట్లిచ్చిన ప్రజలే ఆ తర్వాత ఆరునెలలకే వచ్చిన లోక్‌సభ ఎన్నికల్లో ముఖం తిప్పుకున్నారు. అశోక్ గెహ్లాత్ ముఖ్యమంత్రి అయిన క్షణం నుంచి షెకావత్ తాను ముఖ్యమంత్రి ఆలోచనను పక్కన పెట్టి బీజేపీకి వ్యూహకర్తగా మారిపోయారు. 2003లో బీజేపీని గెలిపించి వసుంధరరాజేను సీఎం చేయడంలో కీలక పాత్ర వహించారు. మరుసటి ఏడాది వచ్చిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓట్ల శాతాన్ని సీట్ల సంఖ్యను తగ్గకుండా పట్టుకొచ్చారు. అయినప్పటికీ 2008 నాటికి రాజస్థాన్ ప్రజలు సీఎం కుర్చీని కాంగ్రెస్‌కు బదలాయించారు. మరో ఐదేళ్లకు అంటే 2013 ఎన్నికల్లో బీజేపీకి 163 సీట్లిచ్చి బ్రహ్మరథం పట్టారు. వసుంధర రెండో దఫా సీఎం అయ్యారు. కాంగ్రెస్ 21 స్థానాలతో ప్రతిపక్ష పార్టీ హోదాను నిలుపుకుంది. ఇక 2018 నాటికి కుర్చీల బదలాయింపు మళ్లీ జరిగింది. కాంగ్రెస్‌పార్టీ మరికొన్ని పార్టీలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అశోక్ గెహ్లాత్ మూడోసారి సీఎం అయ్యారు.

### నవశకం

2013 శాసన సభ ఎన్నికల్లో 21 స్థానాలకు పరిమితమైన కాంగ్రెస్ పార్టీని 2018 నాటికి విజయతీరానికి చేర్చిన నావికుడు ఎవరు? కేవలం ఆనవాయితీగానే కుర్చీల బదలాయింపు జరిగిందా? దేశంలో నమో హవా బలంగా వీస్తున్న సమయంలో కాంగ్రెస్ పార్టీ వైపు ప్రజలను మరల్చిన నాయకత్వం ఏది? రాహుల్ గాంధీ యువ నాయకత్వం మీద ఆశలు పెట్టుకున్నాడు. సచిన్ పైలట్ ఆ ఆశల్ని నిజం చేశాడు.

### పైలట్ నడుపుతాడా?

కాంగ్రెస్‌పార్టీని గెలిపించడానికి పనికి వచ్చిన యువ నాయకత్వం ప్రభుత్వాన్ని నడపడానికి పనికిరాదా? క్లిష్ట సమయంలో పార్టీని ఒక యువకుడి భుజాల మీద పెట్టేటప్పుడే సోనియాగాంధీకి పైలట్ వయసు గుర్తుకు వచ్చి ఉండాలి. పార్టీ పగ్గాలు పట్టుకున్నప్పుడు పనికివచ్చిన చేతులు పాలన పగ్గాలు పట్టుకోవడానికి పనికి రాలేదెందుకో? బహుశా! కాంగ్రెస్ పార్టీకి దేశవ్యాప్తంగా మంచి మెజారిటీ వచ్చి రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి అయి ఉంటే... మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో రాజకీయ సంక్షోభం తలెత్తకపోయి ఉండేది. సచిన్, జ్యోతిరాదిత్య సింధియాలు తన కొడుకు వయసు పిల్లలు... ఇంకా చిన్నవాళ్లు. రాహుల్‌కు పదవీ యోగం కలగక పోవడం తల్లి మనసు తల్లడిల్లడం సహజమే. దానికి విరుగుడుగా రెండు రాష్ట్రాల్లో ఇద్దరు వృద్ధులను సీఎం చేసి తన ఇగోను సంతృప్తి పరుచుకోవడం మినహా సాధించింది ఏమీ లేదు.

రాజస్థాన్ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతున్న సమయం... సచిన్ పైలట్ అసమ్మతి గళాన్ని విప్పాడు. కాంగ్రెస్ అధిష్టానం ఇప్పటికయితే నష్ట నివారణ చేయగలిగింది. కానీ గెహ్లాత్ ప్రభుత్వం ఎంతకాలం మనుగడలో ఉంటుందనేది ప్రశ్నార్థకమే. ఈ సంక్షోభం నుంచి గెహ్లాత్‌ను గట్టెక్కించడానకి వసుంధర రాజె నిజంగానే చక్రం అడ్డు వేస్తోందా? వసుంధర రాజెకు సీఎం కుర్చీ మీద ఇంకా మమకారం తగ్గలేదు. మూడో దఫా కోసం ఆమె ఆశలు పెట్టుకుని ఉన్నారు. ఇప్పుడు గెహ్లాత్‌ను బలపరిచి ప్రభుత్వాన్ని నిలబెట్టడం ద్వారా సచిన్ పైలట్‌ను నిలువరించడమే ఆమె వ్యూహం. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి సీట్లు వస్తే సీఎెం కుర్చీ కోసం గట్టిగా డిమాండ్ చేయవచ్చనేది ఆమె ఆలోచన. ఇప్పుడు పైలట్ వంటి సమర్థత కలిగిన యువకుడికి అవకాశం కల్పిస్తే భవిష్యత్తులో తమకు రాజకీయ వానప్రస్థం తప్ప పదవులు ఉండవనేది పెద్ద తరం ఆందోళన. ఒకవేళ సచిన్ పైలట్‌ను రానివ్వకుండా అడ్డుకున్నప్పటికీ, రాబోయే ఎన్నికల్లో బీజేపీకి మెజారిటీ వచ్చినప్పటికీ వసుంధరకు మాత్ర సీఎం అయ్యే అవకాశం ఉండదు. ఆ పార్టీ నియమావళి ప్రకారం 70ఏళ్లు నిండిన వాళ్లను ప్రధాన స్రవంతిలో ఉంచడం లేదు. రాజేకి ఇప్పటికే 67. మళ్లీ ఎన్నికల నాటికి ఏడు పదులు. పైగా పార్టీ సమీకరణలు కూడా ఆమెకు అనుకూలంగా ఏమీ లేవు. పార్టీ ప్రతిష్ట 163 నుంచి 73కి పడిపోయింది ఆమె హయాంలోనే అంటోంది ఒక వర్గం. ఇలాంటి పరిస్థితుల్లో ఎప్పుడు మునుగుతుందో తెలియని గెహ్లాత్ పుట్టికి తారు తాపడాలు వేయడం ఆమెకు ఇప్పుడు అవసరమా?

## కాలధర్మం

# గణేశం కృష్ణారెడ్డి



గణేశం కిష్టయ్యగా అందరికీ సుపరిచితుడు, సేవాతత్పరుడు గణేశం కృష్ణారెడ్డి తన 72వ యేట జులై 16వతేదీ గురువారం కన్నుమూశారు. ఆయనకు భార్య కల్పన, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు వున్నారు. క్రిష్టయ్య స్వగ్రామం నిడిముసలి. ఆయన విద్యాభ్యాసం చిన్నతనంలో నెల్లూరులోని ఆర్ఎస్ఆర్ హైస్కూల్‌లోనూ, ఆ తర్వాత విఆర్ కాలేజీలోను పూర్తి చేసి అనంతరం కాకినాడ జెఎన్‌టియులో మెకానికల్ ఇంజనీరుగా పట్టా పుచ్చుకున్నాడు.

దీర్ఘకాలం నెల్లూరు నిప్పో కర్మాగారంలో ఇంజనీరుగా పనిచేశాడు. నిప్పోలో పనిచేసే రోజులలో కూడా తన సహచర ఉద్యోగులతోను, కార్మిక సోదరులతోను ఆయన ఎంతో స్నేహభావంతో మెలగడమే కాకుండా సేవా దృక్పథంతో కూడా వ్యవహరించేవాడని ఆయన సహోద్యోగులు చెప్తున్నారు.

**వ్యాపార రంగంలో...**

1977లో ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ తీసుకుని తన పేరునే సంస్థకుపెట్టి కృష్ణా ఏజెన్సీస్‌ని కిష్టయ్య ప్రారంభించాడు. అప్పటి నుండి ఇండియన్ గ్యాస్ కృష్ణారెడ్డిగా ప్రసిద్ధి చెందాడు. ఎదిగే కొద్దీ ఒదగాలన్న సామెతకి నిలువెత్తు నిదర్శనం కృష్ణారెడ్డి, ఎంత ఎత్తుకు ఎదిగినా, ఎంత సంపద పోగుచేసినా ఆయన మాత్రం నిరాడంబర జీవి, మనిషి చాలా సింపుల్‌గా ఉండేవాడు, ఆయనలో గర్వం అస్సలు కనపడేదికాదు. రెడ్‌క్రాస్ వేదికగా క్యాన్సర్ ఆసుపత్రిలో నిత్యం ఒక కార్యకర్తలా పనిచేసేవాడు. తన అధ్యక్షతన పల్లిపాడు గాంధీ ఆశ్రమ అభివృద్ధికి నిరంతరం తపించాడు. ఆయన హయాంలోనే తన మిత్రుల సహకారంతో ఆశ్రమంలో పొణకా కనకమ్మ విగ్రహాన్ని నెలకొల్పడమే కాకుండా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాడు.

స్వతహాగా సౌమ్యుడు, సద్గుణ సంపన్నుడు అయిన కృష్ణారెడ్డికి సమాజ సేవంటే పిచ్చి, సేవ చేయడం అంటే ఒక వ్యసనం. తన చివరి శ్వాస వరకు సేవనే జపించాడు, సేవకోసమే తపించాడు. సేవ కోసం శ్రమదానమే కాకుండా ధన దానం కూడా భారీగానే చేసేవాడు. క్యాన్సర్ ఆసుపత్రికి కోటిరూపాయలిచ్చాడు. గాంధీ ఆశ్రమంలో డి-అడిక్షన్ సెంటర్ నెలకొల్పడానికి తనవంతు సహాయంగా 10లక్షల రూపాయలిచ్చాడు. మరణానికి ఒక రోజు ముందు కూడా గాంధీ ఆశ్రమం అభివృద్ధి గురించి శ్రద్ధ తీసుకున్నాడు. ఒక మంచి సేవాతత్పరుడిని, స్నేహశీలిని, కుటుంబ పెద్దని కోల్పోయి శోకసముద్రంలో వున్న గణేశం కిష్టయ్య కుటుంబ సభ్యులకు, సహచర సేవకులకు, స్నేహితులకు, కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలుపుతోంది 'లాయర్'.

# గోసుకొండ వెంకటసుబ్బయ్య



నెల్లూరు సాహితీరంగంలో గోసుకొండ వెంకటసుబ్బయ్యంటే తెలియని వారుండరు. మంచి వ్యక్తి, సౌమ్యుడు, సాహిత్య సేవా పిపాసి అయిన ఆయన ఈనెల 19న హైదరాబాద్‌లోని తన మూడవ కుమారుని ఇంట కన్నుమూశారు. ఆయన వయసు 96 సంవత్సరాలు. ఆయన భార్య సత్యవతమ్మ 2001లో, పెద్దకుమారుడు నాగరాజు 2018లో మరణించారు. ఇప్పుడొక కూతురు ఇద్దరు కొడుకులు ఉన్నారు.

గోసుకొండ స్వస్థలం మహమ్మదాపురం. 1924లో ఆయన జన్మించారు. నెల్లూరు వేదసంస్కృత పాఠశాలలో చదువుకుని భాషాప్రవీణుడై, కొంతకాలం నెల్లూరు సిఏఎం హైస్కూల్లో తెలుగుపండితునిగా పనిచేశారు. ఆ తర్వాత విఆర్ కాలేజీలో తెలుగు అధ్యాపకునిగా చేరారు. దాదాపు 36 సంవత్సరాలు విఆర్‌సిలో పనిచేసి 1994లో రిటైరయ్యారు. ఇక ఆయన సాహితీసేద్యం ఎంతో అమూల్యమైనది. వర్ధమాన సమాజం సభ్యుడిగా ఆయన పనిచేశాడు. తిక్కవరపు రామిరెడ్డికి, ఆ తర్వాత కాలంలో బెజవాడ గోపాలరెడ్డికి ఆయన ఎంతో ఆత్మీయుడిగా ఉండేవారు. డా. బెజవాడ గోపాలరెడ్డి అవార్డు కమిటి సభ్యుడిగా కూడా ఆయన ఉన్నారు. నెల్లూరులో కవిత్రయ జయంతి సంఘం కార్యదర్శిగా సుమారు పాతికేళ్ళపాటు సేవలందించాడు. ఎన్నో సాహిత్యకార్యక్రమాలు నిర్వహించి మంచిపేరు తెచ్చుకున్నాడు. ఆ తర్వాత 'సాహిత్య సదస్సు' పేరుతో మరిన్ని సాహితీ కార్యక్రమాలు చేపట్టి ఎందరో ప్రముఖులను నెల్లూరుకు రప్పించి ఉపన్యాసాలిప్పించాడు. ఆయన సన్మానించని కవులు, సాహితీవేత్తలు లేరంటే అతిశయోక్తి కాదు. ప్రత్యేకించి 'లాయర్' వ్యవస్థాపకులు తుంగా రాజగోపాలరెడ్డికి, కస్తూరిదేవి విద్యాలయ సంస్థల సెక్రటరీ & కరస్పాండెంట్ జె.వి.రెడ్డికి ఆయన మంచి స్నేహితులు. డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి ఉమెన్స్ అకాడమీలో కూడా ఆయన కొద్దికాలం పనిచేశారు. నెల్లూరులోని పాతతరం, కొత్త తరం సాహితీవేత్తలందరూ ఆయనకు బాగా తెలిసినవారే. ఏదేమైనా మంచి మనసు, కార్యదీక్షాదక్షత ఉన్న సాహితీవేత్త.. ఎంతోమందికి గురువు అయిన గోసుకొండ వెంకటసుబ్బయ్య గారి మరణానికి చింతిస్తూ.. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది.. 'లాయర్'!.

# చాగంటి సీతాపతిరావు



నెల్లూరు విఆర్ కళాశాలలో 39 సంవత్సరాల పాటు ఆంగ్లోపన్యాసకునిగా పనిచేసి ఎందరికో ఇంగ్లీషు పాఠాలు చెప్పిన చాగంటి సీతాపతి రావు తన 89వ ఏట.. ఈనెల 20న నెల్లూరు రామ్మూర్తినగర్‌లోని స్వగృహంలో మృతిచెందారు. ఆయన భార్య దమయంతి 2012లో దివంగతురాలయ్యారు. వీరి ఇద్దరు కొడుకులు అమెరికాలో స్థిరపడ్డారు. ఒక కూతురు కూడా ఉన్నారు. అల్లుడు వెంకటరత్నం చెన్నై ఐఐటిలో మెకానికల్ ఇంజనీరిగ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని 'చాగల్లు' సీతాపతిరావు స్వస్థలం. 1952 నుంచి ఆయన నెల్లూరులోని విఆర్‌సిలో పనిచేసి 1991లో రిటైరయ్యారు. ఇంగ్లీషు పాఠాలు చెప్పడంలో ఆయనకాయనే సాటి. ప్రత్యేకించి టెన్నిస్ కూడా బాగా ఆడేవారు. బహుమతులు కూడా తెచ్చుకున్నారు. ప్రముఖ ధార్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు తాతగారు, సీతాపతి తాతగారు ఇద్దరూ స్వయానా అన్నదమ్ములు. సీతాపతిరావు మృతికి చింతిస్తూ..విఆర్‌సి విశ్రాంత ఆంగ్ల శాఖాధిపతి వివిస్ రామచంద్రరావు, విశ్రాంత ప్రిన్సిపాల్ డా.ఎం.సుబ్రహ్మణ్యంతో పాటు రిటైర్డ్ లెక్చరర్లు డాక్టర్ ఏవి సబ్బారాయుడు, డా. పి.మల్లికార్జునరెడ్డి, సాహితీవేత్త డా.కాళిదాసు పురుషోత్తం, హెచ్ఎస్‌వికె రంగారావు, నేలభట్ల సుందరబాబు, బి.భవాని శంకర్ తదితరులు తమ సంతాపం తెలియజేశారు. ఆయన మృతికి విచారం ప్రకటిస్తూ..వారి కుటుంబానికి సంతాపం తెలుపుతోంది..'లాయర్'!..

# రాజకీయ కుట్ర జరుగుతోందా?

(మొదటి పేజీ తరువాయి)

దీనికి వైసీపీ కూడా అదే ప్రతిస్పందన చూపింది. గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్త ప్రభుత్వంలో దళితులకు పెద్ద పీట వేసింది. ఉప ముఖ్యమంత్రితో పాటు హోమ్, ఎడ్యుకేషన్, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మహిళా శిశు సంక్షేమం లాంటి ఎన్నో కీలక శాఖలను ఇచ్చి సత్కరించింది. దళితుల పట్ల తమకున్న ప్రేమాభిమానాలను చాటుకుంది. ఐఏఎస్ అధికారుల నియామకాల దగ్గరనుంచి అటెండర్ వరకూ బదిలీల్లో దళిత సోదరులకు ప్రాధాన్యత ఇస్తూ వాళ్ళ నమ్మకాన్ని నిలుపుకునేలా వారికి అండగా నిలిచింది.

అలాంటి పార్టీలో ఒక్కసారిగా ఎందుకు ఇంత అలజడి? రాష్ట్రంలో జరుగుతోన్న వరుస సంఘటనలు చూస్తే మాత్రం ఏదో జరుగుతోందన్న అనుమానం కలగకమానదు. వాస్తవానికి ముఖ్యమంత్రి దళితులపై దాడులను ఎట్టి పరిస్థితుల్లో సహించడు అన్న విషయం అధికార పార్టీ కంటే ప్రతిపక్షాలకు ఇంకా బాగా తెలుసు. కానీ ఈ ఘటనల్లో కొన్ని చోట్ల అధికార పార్టీ వాళ్ళ పేర్లు వినిపిస్తున్నాయి. అదే ఇప్పుడు అనుమానం, ఆందోళన కలిగించే అంశం.

వీటిల్ని ఒక్కో సంఘటనని విడివిడిగా చూస్తేనే సరైన న్యాయం చేసినట్లవుతుంది. మొదటగా విశాఖ డాక్టర్ సుధాకర్ కేసు. ఆ కేసులో మాస్కులు లేవని హడావుడి చేసినందుకే నన్ను సస్పెండ్ చేశారు, కేసులు పెట్టారు అని డాక్టర్ సుధాకర్ మొదట్లో అన్నా ఆయన టీడీపీ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఇంటికి అదేరోజు వెళ్లి 3గంటలు అక్కడే ఉండి రావడం, ఆ తర్వాత ప్రభుత్వంపైనే కాకుండా ముఖ్యమంత్రిపైనా వ్యక్తిగత, రాజకీయ ఆరోపణలు చేయడం లాంటివి చూసిన ఎవరైనా ఆ కేసులో డాక్టర్ సుధాకర్‌నే తప్పు పడతారు, ఆ తర్వాత సుధాకర్ 'నా ఉద్యోగం నాకు ఇస్తే చాలు' అంటూ మళ్లీ ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడినా వాటిల్ని ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. కానీ ఇక్కడ కూడా ఈ కేసుని చేపట్టిన తీరుపైనా విమర్శలు ఉన్నాయి. చిన్న విషయాన్ని అంతదూరం వచ్చేదాకా లాగకుండా వదిలేయడం కానీ, అక్కడే పరిష్కరించే యంత్రాంగం లేకపోవడం వల్ల కానీ, అది చిలికి చిలికి గాలివానలా మారడం జరుగుతోంది. చివరకి హైకోర్టు ఈ కేసును సీబీఐకి ఇవ్వడం, సీబీఐ విచారణ సమయంలో సుధాకర్ వ్యవహార శైలి... ఇవన్నీ మరో కోణం.

ఇక రెండోది, చిత్తూరు జిల్లాలో మరో డాక్టర్ అనితా రాణి వ్యవహారం. ఎప్పుడో జరిగిన ఘటన, పోలీస్‌లు స్పందించడం లేదంటూ స్థానిక నాయకత్వంపై రాజకీయ ఆరోపణలు... ఇక్కడా ప్రతిపక్షం పాత్ర కనిపించింది. వాళ్ళ ప్రోత్సాహంతోనే డాక్టర్ అలా చేస్తోందని అధికార పార్టీ విమర్శించింది. ఈ సంఘటనలో కూడా జరిగింది పొరపాటా..? లేక రాజకీయ కోణమేదన్నా దాగుందా అన్నది స్పష్టంగా అర్థం అయినా ప్రజలకు గట్టిగా వివరించలేని పరిస్థితి.

ఇక నిన్న తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన ఘటన పరాకాష్టగా చెప్పుకోవచ్చు. నిజంగా సభ్యసమాజం సిగ్గుపడే సంఘటన. ఒక దళిత యువకుడికి పోలీస్‌స్టేషన్‌లోనే గుండు కొట్టించడం, వైసీపీ నేత కారుకు అడ్డం జరగలేదనే ఇదంతా చేశారన్న ప్రచారం జరగడం పార్టీని నిజంగా ఇబ్బంది పెట్టే అంశమే. గుండు కొట్టించి ఊర్లో తిప్పుతానంటూ వైసీపీ నేత బహిరంగంగానే హెచ్చరించడం, దాన్ని అమలుపరిచే బాధ్యతను అక్కడి పోలీసులు తీసుకోవడం, ఆ యువకుడిని పోలీస్‌స్టేషన్‌ను తీసుకెళ్లి గుండు గీయించి అతన్ని చంపేస్తామంటూ బెదిరింపులకు పాల్పడడం, విచక్షణారహితంగా కొట్టడం నిజంగా అందరినీ తీవ్ర ఆందోళన కలిగించిన అంశాలే! నిజంగా ఈ ప్రభుత్వంలో ఎవరూ ఊహించని సంఘటన ఇది. ముఖ్యమంత్రిని సైతం ఎంతో ఆందోళనకి, ఆగ్రహానికి గురిచేసిన విషయం. సంబంధిత పోలీస్ సబ్‌ఇన్స్‌పెక్టర్, కానిస్టేబుల్‌పై కేసులు పెట్టి, అరెస్ట్ చేసి రిమాండ్ చేశారు కానీ ఆ చర్య ఎవ్వరినీ సమాధాన పరచలేకపోతోంది. అసలు ఎందుకింత స్థాయిలో కొంతమంది నాయకులు వ్యవహరిస్తున్నారు? పోలీస్‌లు ఇలాంటి నాయకులకు ఎందుకు వత్తాసు పలుకుతున్నారు? అలాంటి నేతలకు సహకరించమని పైస్థాయిలో ఒత్తిడులు ఏమైనా వస్తున్నాయా? మరి ఎందుకు ఇంత బరితెగింపు? ఈ సంఘటనలో కూడా అక్కడ వైసీపీ నేతగా చెప్పుకున్న ఆ వ్యక్తి తప్పిదమే కానీ పోలీస్‌స్టేషన్‌లో ఆ తతంగం జరగడం ఎవ్వరికీ జీర్ణం కాని విషయం. ఇలాంటి సంఘటనలు జరగకుండా, ఇంకోటి పునరావృతం కాకుండా పార్టీ పటిష్ట చర్యలు తీసుకోవాలన్నది అందరి ఆకాంక్ష.

ఇక చీరాలలో జరిగిన సంఘటన లాంటివి గతంలో అనేకం జరిగాయి. అసలు మాస్క్ ధరించని కిరణ్ దళితుడని ఎస్‌ఐకి తెలిసి చేసిన దాడి కాదు, కానీ ఆ దాడిలో గాయపడ్డ ఆ యువకుడు మరణించాడు కాబట్టి... అదీ ఈ వరుస సంఘటనలకు జతయ్యింది కాబట్టి దాన్నీ ప్రస్తుతానికి విడదీసి చూడలేని పరిస్థితి. ఇక హర్షకుమార్, మహాసభ రాజేష్ లాంటి వాళ్ళ ఆరోపణలు, కొంతమంది ఎమ్మెల్యేల వ్యవహారశైలి అన్నీ తప్పిదాలకూ పార్టీ అప్రదిష్ట పాలు కావాల్సి వస్తోంది. ఇదే సమయంలో ఆ ఘటనల్ని రాజకీయాలకు వాడుకుంటున్న ప్రతిపక్షానికి ఆ అవకాశాలే రాకుండా చూస్తే అసలు ఈ రచ్చే ఉండదు కదా అన్నది ఒక అభిప్రాయం అయితే... ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు తక్షణం స్పందించే క్విక్ రెస్పాన్స్ టీమ్స్ కూడా లేకపోవడం పైనా పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఏదేమైనా ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకూడదని ఆకాంక్షిద్దాం.

# రోగ నిరోధకశక్తిని పెంచుకోవాలి

ప్రతి ఒక్కరూ రోగ నిరోధకశక్తిని పెంపొందించుకోవాలని, అందుకు సరైన పౌష్టికాహారం తీసుకోవాలని మెప్మా కోఆర్డినేటర్ కాంతయ్య అన్నారు. గూడూరులోని షాదీమంజిల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెప్మా సిబ్బందితో ఆయన మాట్లాడుతూ కరోనా వ్యాధి నియంత్రణకు తగు జాగ్రత్తలు పాటించాలని, యోగా, శారీరక వ్యాయామం వంటివి ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని, ఆరోగ్యం పట్ల అందరూ శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు.

# నేనెరిగిన కిష్టయ్య



గణేశం కృష్ణారెడ్డి



- వరప్రసాద్ రెడ్డి

***నన్ను 1957లో అంటే సుమారుగా 63 సం॥ల క్రితం నెల్లూరులో స్టోన్ హౌస్ పేటలోని ఆర్.ఎస్.ఆర్.ఎం. హైస్కూల్లో 6వతరగతి (ఆ రోజుల్లో ఫస్ట్ ఫామ్ అనేవారు)లో నా మేనమామ కీ॥శే॥ గండవరం సేతురామిరెడ్డిగారు చేర్పించారు. హైస్కూల్లో ఆ తొమ్మిది సంవత్సరాల వయస్సులో అడుగు పెట్టినప్పటి నా మనస్థితి ఒకింత బెరుకుగా, భయంగా, అన్నీ వింతగా, ఆ టీచర్ల హావాభావాలు అర్థం చేసుకునే దిశగా, కొత్త కొత్త సహవిద్యార్థుల్లో ఎవరితో సాన్నిహిత్యం పెంచుకోవాలో, ఎవరితో దూరంగా వుండాలో తెలియని అయోమయంలో అల్లాడుతున్నరోజులవి.***

ఒకరకంగా ఏదో ఒక పెద్దదిక్కు లేదా భరోసాయిచ్చి భుజంతట్టి ధైర్యం చెప్పగలిగే మనిషికోసం వెతుక్కుంటున్నాను. ఆ స్కూల్లో ఎవరితో ఎలా మెలగాలో, ఏ టీచరు సౌమ్యులో, ఏ టీచరుతో జాగ్రత్తగా వుండాలో సూచనలు చేసే పెద్దదిక్కు కోసం ఎదురుచూస్తూండేవాణ్ణి. ఆ సమయంలో నాకు ముగ్గురు సీనియర్లు (వాళ్ళు ఏడో తరగతే) ఆసరాగా దొరికారు. వాళ్ళు గణేశం కృష్ణారెడ్డి, గోవిందరావు, నా కజిన్ ఇసనాక రామకృష్ణారెడ్డి. ఆ ముగ్గుర్లో గణేశం కృష్ణారెడ్డి కాస్తంత పెద్దదిక్కు. అది, స్వతహాగా చిన్నవయస్సులో (ఆయనకు పదిసంవత్సరాల కన్నా వయస్సు లేదు) అబ్బిన పెద్దరికం. ఆయన్ని ఒక మార్గదర్శిగా ఆ చిన్నవయస్సులో నేను ఊహించుకున్నాను.

వాళ్ళు ముగ్గురు ఒకే క్లాసువాళ్ళయినా ఇతనిదొక పెద్ద తరహా. మిగతా యిద్దరి కన్నా ఎక్కువ చొరవ, ఎక్కువ ధైర్యం, ఎక్కువ సలహాలు, హెచ్చరికలు చేసింది ఈయనే. ఈ ముగ్గురు నన్ను స్కూల్ ప్రారంభంలోనూ, ఇంటర్వెల్లోనూ, స్కూల్ అయిపోయాక కూడా వచ్చి కలిసి నా గురించి విచారణ చేసి ఉపశమనంగా మాట్లాడి వెళ్ళేవారు. ఆ ముగ్గురు నా దగ్గరికి ఇంచుమించు ప్రతిరోజు వచ్చేవారు. ముగ్గురూ వచ్చేవారనడం కంటే ఆ మిగతా యిద్దర్ని గణేశం కృష్ణారెడ్డి తీసుకొచ్చేవారు అనడం సబబు. అంటే, నిజానికి ఆ వయస్సులోనే ఆయనకు పెద్దరికం, బాధ్యత, సలహాసంపత్తినిచ్చే నిపుణత, తన వెనుక, తనతోటే ఓ నలుగురిని పోగుచేసే తత్వం పుట్టుకతోనే వచ్చి ఉండాలి. అదీ ఆయన ప్రత్యేకత.

నాకాయన, ఫలానా టీచర్ ఫలానా విషయంలో ఎలా వ్యవహరిస్తారో ముందుగా హెచ్చరికలు చేసి నన్ను సన్నద్ధం చేసేవారు. ఏ టీచర్ హోంవర్క్‌కు ప్రాధాన్యతనిస్తారో, ఏ టీచర్ రెగ్యులర్ అటెండెన్స్‌కు ముచ్చటపడతారో, ఏ టీచర్ క్లాసు మధ్యలో నిన్నటి క్లాసులో చెప్పిన పాఠం తాలూకు ప్రశ్నలు సంధించి తాట వలుస్తారో అన్నీ చెప్పి నన్ను జాగ్రత్తపరిచేవారు. ఇది ఆయన సౌభ్రాతృత్వ నైజం.

## ఆయనది అరుదైన వ్యక్తిత్వం

పాఠ్యపుస్తకాలు స్కూళ్ళు తెరిచిన వెంటనే షాపులకు వచ్చేవి కావు. వచ్చినా అందరికి అందేవి కావు. అదొక పెద్ద భగీరథ ప్రయత్నం. వెంకట్రామ & కో.లో ఎప్పుడు పాఠ్యపుస్తకాలు వస్తాయో తాను ముందుగానే తెలిసికొని నన్ను అలర్టు చేసేవారు. గేమ్స్ పీరియడ్స్‌కు అనువైన షార్ట్ నిక్కర్ల గురించి గుర్తుచేసేవారు. పదేళ్ళ వయస్సులో అంత చొరవ, సహాయం చెయ్యాలన్న తపన వుండేవి. పెద్దరికపు సలహాలు అవి తన వయసుతో పాటు పెరిగి ఒక అరుదైన వ్యక్తిగా ఆయనను మళ్ళీ నేను 1967లో కాకినాడ ఇంజనీరింగ్‌లో చేరినప్పుడు వారితో పునః సమాగమంలో గుర్తించాను.

నేను ఆర్.ఎస్.ఆర్.యం. హైస్కూల్ 4వ ఫారం తర్వాత వదిలి మద్రాస్ వెళ్ళి నా విద్యను అక్కడ కొనసాగించాను. ఆయన్ని మళ్ళీ కలిసింది 1967లో అంటే ఏడు సంవత్సరాల తర్వాత ఇంజనీరింగ్ విద్యార్థిగా ఆయన నాకు సీనియర్ విద్యార్థిగా కలిశారు. ఆయనలోని సహజరీతిగా ఉన్న పెద్దరికం, ఆసరా, భరోసా ఇవ్వగలిగిన చొరవ మరింత ద్విగుణీకృతంగా కనిపించాయి. నాకు 19సం॥రాల వయస్సు వచ్చింది. కొత్త పరిచయాలు కల్పించుకొని మసలుకోవడం తెలిసింది. అయినా ఆయన నాకు హైస్కూల్లో 9సంవత్సరాల వయస్సులో ఇచ్చిన అభయముద్ర ఇంజనీరింగ్ కాలేజీలోనూ కొనసాగించారు. ఇంజనీరింగ్ మూడు సంవత్సరాలు ఆయన స్నేహచ్ఛాయలో, ఆయన మందలింపుల్లో, ఆయన హెచ్చరికల్లో, ఆయన అండదండల్లో గడిచిపోయాయి.

## ఆత్మీయునిగా, ఆత్మబంధువుగా..

ఆయనలో విశేషగుణం, ఆయనతో ఒకసారి పరిచయమైనా ఏ వ్యక్తినీ, ఆ పరిచయాన్ని అలా వదిలెయ్యరు. ఆ పరిచయాన్ని పరిపరివిధాల పెంపు చేసుకుంటూపోతారు. ఆ వ్యక్తితో పరిచయం ఆ వ్యక్తికే పరిమితం చేయరు. ఆ వ్యక్తికి సంబంధించిన కుటుంబంతో మమేకమవుతారు. ఆయన అలా ఎందరో వ్యక్తులకు, వారి వారి కుటుంబాలకు ఎంతో సన్నిహితులయ్యారు. ఆ కుటుంబాలన్నీ ఈయనను తమ కుటుంబంలోని వ్యక్తిగా, ఆత్మబంధువుగా భావించే విధంగా కలిసిపోయారు. ఇది చాలా అరుదైన లక్షణం. ఆయనది ఎప్పటికీ గుర్తుండిపోయే విలక్షణ వ్యక్తిత్వం.

## మాకు పెద్దదిక్కు ఆయనే..

ఇంజనీరింగ్ అయిపోయి జీవితంలో అడుగుపెట్టి ఉద్యోగ ప్రస్థానం, గృహస్థ ప్రస్థానం, వ్యాపార ప్రస్థానం అన్ని దశలు దాటి వస్తున్ననాకు, నేటి 72సం॥ల వయస్సు వరకు కిష్టయ్యతో అనుబంధం కొనసాగుతూ వస్తూనేవుంది. నాతోనే కాదు, నా కుటుంబసభ్యులతో కూడా. మా ఇంట జరిగిన శుభానికి, అశుభానికి ఆయనే పెద్దదిక్కుగా వచ్చి నిలబడి అన్ని కార్యక్రమాలు స్వయంగా పర్యవేక్షించేవారు. ఇది నా ఒక్కడికే కాదు, ఆయన 73సం॥ల జీవితంలో నాలాంటి ఎంతమందికో ఇలాంటి పెద్దరికం, యిలాంటి ఆత్మబంధుత్వం పంచినవారు. ఆయన మధ్యలో సుమారుగా 40సం॥ల క్రితం రామచంద్ర మిషన్ జ్ఞానమార్గాన్ని ఎన్నుకున్నారు. అంతకుమునుపు హైందవ సదాచార ప్రకారం విగ్రహపూజ, పూజ పునస్కారం అన్ని నిర్వహించిన వ్యక్తి, ఒక్కసారిగా రామచంద్ర మిషన్ జ్ఞానమార్గంలో ప్రవేశించాక ఆయనలో పెనుమార్పు వచ్చింది. ఆ మార్పు ఆయనని మరింత సమున్నతుడిగా తీర్చిదిద్దింది.

## సమాజ సేవాతత్పరునిగా...

సామాజిక స్పృహ, పదిమందికి ఏదైనా మేలు చేయాలన్న సేవాతత్పరత ఆయనలో ఎక్కువయ్యాయి. విద్యార్థిదశలో తనకు చేతనైనంత సహాయం విద్యార్థులకు చేసినట్లే, మధ్య వయస్సులో సమాజానికి ఏదైనా చెయ్యాలన్నటువంటి ఆలోచన వారిని అనేక సామాజిక కార్యక్రమాలకు దగ్గర చేసింది. ముఖ్యంగా పల్లిపాడులోని గాంధీ ఆశ్రమంవైపు ఆకర్షితులై అక్కడ తన సేవలను కొనసాగించారు. రెండవది రెడ్‌క్రాస్ ద్వారా రోగులకు, బ్లడ్‌బ్యాంకుకు సంబంధించిన విషయాలకు చేదోడువాదోడుగా తన సేవలందించారు. అందరు ఇంజనీరింగ్ విద్యార్థుల్లాగా ఇంజనీరింగ్ తర్వాత ఆయన ఎక్కడా ఉద్యోగ ప్రయత్నం చేయలేదు. స్వయం ఉపాధి పథకం క్రింద గ్యాస్ ఏజెన్సీ తీసుకొని ఆ గ్యాస్ పంపిణీ విధానం ఒక క్రమం, ఒక పద్ధతి, ఒక నిబద్ధత పాటించి, ఒక ఆదర్శ గ్యాస్ డీలర్‌గా నెల్లూరు జిల్లాలో పేరుపొందారు.

## అందరివాడు.. మన కిష్టయ్య

ఆయనలాంటి వాళ్ళు సమాజంలో పదిమంది వున్నా లక్షమంది నాయకులకు సమానం. అలాంటి వ్యక్తి మనమధ్య లేకుండా హఠాత్తుగా నిష్క్రమించడం బాధాకరం. ఆయన జ్ఞాపకాలు ఎల్లప్పుడు నన్ను వెంటాడుతూనే ఉంటాయి. ఆయన అంతటి స్నేహశీలి. ఆయన ఎందరికో అందరివాడు. మళ్ళీ మరో జన్మ తీసుకొని మరో కిష్టయ్యలాంటి వ్యక్తిగా మనకు దర్శనమిస్తాడని ఆశిస్తూ...

ఆయనను కోల్పోయిన ఆయన కుటుంబసభ్యులకు, నాలాంటి ఆయన మిత్రులకు.. నా ప్రగాఢ సానుభూతి.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# శ్రద్ధాంజలి



జననం : 23.06.1936 మరణం : 22.07.2020

నిరంతర సేవాతత్పరులు, ఎందరికో స్ఫూర్తిప్రదాతలు
మాకు మార్గదర్శకులు

## డా. చిల్లకూరు మోహన్‌రెడ్డి గారు

తే. 22.07.2020ది బుధవారం తెల్లవారుఝామున
దైవసాన్నిధ్యం పొందారు.

ఆ మహనీయుని మహాత్మకు శాంతిని చేకూర్చమని
భగవంతుని ప్రార్థిస్తూ...

తమ్ముడు - మరదలు
**ప్రొ॥ సి.యం.కె.రెడ్డి - శ్రీమతి నిర్మల, చెన్నై**

తమ్ముని కుమారుడు - కోడలు
**డా॥ సి.యం.కిషోర్ - శ్రీమతి లీలాదేవి, చెన్నై**

తమ్ముని కుమార్తె - అల్లుడు
**శ్రీమతి హరిత - డా॥ రమానంద్‌రెడ్డి, కాకినాడ**

తమ్ముని మనుమలు.. మనుమరాండ్రు
**జయేష్ & అస్మిత కీర్తన లక్ష్మి & తనవ్**

# శ్రద్ధాంజలి



జననం : 16.10.1930 మరణం : 20.07.2019

## శ్రీమతి తుంగా శ్రీదేవమ్మ గారు

(స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి గారి సతీమణి)
పరమపదించి జూలై 20, 2020 నాటికి
ఏడాది గడిచిన సందర్భంగా...
ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

- కుటుంబసభ్యులు

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** e-mail: roopagroup@yahoo.com